

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


# ఎంపిడివో కార్యాలయం తనిఖీ చేసిన జెడ్పీ సిఈవో

**పెద్దశంకరంపేట, ఆగస్టు23 ప్రభాతవార్త:**

పెద్దశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయాన్ని మెదక్ జిల్లా జెడ్పీ సీఈవో ఎల్లయ్య శుక్రవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పాలన కేంద్రంలో వచ్చే దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ప్రజా పాలన కేంద్రం పనితీరును పరిశీలించడంతో పాటు అందులోని రికార్డులను సైతం తనిఖీ చేశారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను తప్పనిసరిగా అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫిక్ ఉన్నీసా, ఎంపీవో విఠల్‌రెడ్డి, సూపరింటిండెంట్ షాకర్, కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# జిపిపి డిపోను సందర్శించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 23 ప్రభాతవార్త:**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపోను శుక్రవారం హైద్రాబాద్, కరీంనగర్ జోన్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సి.వినోద్ కుమార్ అకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా డిపో ఆవరణలో మొక్కను నాటి డిపోలోని అన్ని సెక్షన్ల సూపర్వైజర్స్, సిబ్బందిని పలకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాఖీ ఫెస్టివల్ ఛాలెంజ్‌లో భాగంగా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో ఉద్యోగులు అందరు అంకితభావంతో పనిచేసి రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమమైన 148.85 ఓఆర్ తెచ్చినందుకు ఉద్యోగులను ప్రశంసించారు. ఇలాగే కృషిచేస్తూ డిపో అభివృద్ధికి పాటుపడాలని కోరారు. మహాలక్ష్మి పథకం వచ్చాక కండక్టర్ మరియు డ్రైవర్స్ ఒత్తిడిలో పనిచేస్తూ కూడా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపినందుకు వారి యొక్క శ్రమను కొనియడారు. జిపిపి పరిధిలోని ప్రయాణీకులకు అనుగుణంగా బస్సులు నడిపేందుకు, అలాగే కొన్ని ట్రిప్స్ పెంచేందుకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ పవన్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ బి.బాబునాయక్, మెకానికల్ సూపర్వైజర్ ఎండి.జమీల్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లు

-చర్చా వేదికలో ప్రతి ఒక్కరూ ఇచ్చిన సలహాలు, సూచనలు
-ప్రతి ఒక్కటి రికార్డు చేసి వివరాలను ప్రభుత్వానికి అందజేస్తాం
-కలెక్టర్ మను చౌదరి




మాట్లాడుతున్న కలెక్టర్ మను చౌదరి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

తెలంగాణ నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లుపై మేధావులకు, న్యాయవాదులకు, ప్రజాప్రతినిధులు, రాజకీయా పార్టీల ప్రతినిధులు, జర్నలిస్టులు, ప్రజలకు అవగాహన కల్పించి చట్టంలో పొందుపరచాల్సిన 20 అంశాలలో సలహాలు, సూచనలు తీసుకోవడం కోసమే చర్చ వేదిక నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో శుక్రవారం తెలంగాణ ప్రభుత్వ నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లుపై చర్చ వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్చా వేదికలో ప్రతి ఒక్కరూ ఇచ్చిన సలహాలు, సూచనలను ప్రతి ఒక్కటి రికార్డు చేయడం జరిగిందని వివరాలను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. అంతకు ముందు జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, దుబ్బాక తహశీల్దార్ వెంకటరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నూతన ఆర్ఓఆర్ 2024 ముసాయిదా బిల్లులోని 20 అంశాలను వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజలు, జర్నలిస్టులు, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ప్రతినిధులు,ట్రెస్మా నాయకులు మాట్లాడుతూ కొత్త చట్టంలో భూ రికార్డులు ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లో కూడా ఉంచాలన్నారు. జవాబుదారితనంతో కూడిన విఆర్ఓ వ్యవస్థను మళ్లీ ప్రవేశపెట్టిలని..క్షేత్ర స్థాయిలో రెవెన్యూ రికార్డులపై అజమాయిషీ తహశీల్దార్ వద్దనే ఉండాలన్నారు. రికార్డు కరెక్షన్ అప్షన్ ఆర్డీఓకు ఇవ్వలని విల్ డీడ్ చేసినప్పుడు సాక్షులను విచారించి రిజిస్ట్రేసన్ చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు వివిధ పనులతో బిజీగా ఉంటారని భూముల రిజిస్ట్రేషన్లు సబ్ రిజిస్ట్రార్లకు అప్పగించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, కలెక్టర్ ఏవో రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధథులు,న్యాయవాదులు,ట్రెస్మా, సభ్యులు, జర్నలిస్టులు, ప్రజలు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫూట్ బోర్డుపై ప్రయాణం-నిండు ప్రాణాలకు సంకటం

-రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యల పెంచాలి



ఫూట్ బోర్డుపైనే నిల్చుని ప్రయాణం చేస్తున్న ప్రయాణీకుల దృశ్యం

**చౌటకూరు, ఆగస్టు 23, ప్రభాతవార్త:**

రద్దీకి అనుగుణంగా ఆర్టీసి బస్సుల సంఖ్యను పెంచకపోతుండటంతో ప్రయాణీకులు తమ నిండు ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన దుస్తితి దాపురించింది. మొన్నటి వరకు ప్రయివేటు వాహనాల్లో ప్రయాణం ప్రమాద కరం అన్న ప్రజలు నేటు ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం ఇబ్బంది కరం అంటున్నారు. ప్రయాణీకుల సంఖ్య పెరగడం, పనులకు ఆలస్యమవుతుందన్న భయంలో ప్రమాదం అని తెలిసినా ఫూట్ బోర్డుపై ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. సింగూర్ సంగారెడ్డి మార్గంలో ఆర్టీసి బస్సులో ప్రయాణించేందుకు ప్రజలు జంకుతున్నారు. ఉమ్మడి పుల్కల్ మండలానికి చెందిన 18 గ్రామాల ప్రజలు నిత్యం ఈ రూట్లో ప్రయాణం చేస్తూ ఉంటారు. సాయంత్రం బస్సు సింగూరు నుంచి సంగారెడ్డికి వెళ్లే సమయంలో ముద్దాయి పేట చౌరస్తా వద్ద విద్యార్థులతో బస్సు నిండిపోతోంది. అటుగా ప్రయాణించే ప్రయాణీకులకు బస్సులో ఎక్కే అవకాశం లేక ఫూట్ బోర్డుపైనే నిల్చుని ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా ఫూట్ బోర్డు ప్రయాణం తప్పడం లేదని విద్యార్థులు, యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫుల్‌గా ఉన్న బస్సులో మహిళలు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయి. తమ పిల్లా పాపలతో, సమాగ్రితో కూడిన బస్తాలను తీసుకుని బస్సులో ఎక్కేందుకు పడుతున్న అవస్థలు చెప్పలవిగా ఉన్నాయని చెప్పడం అతిశయోక్తి కాదు. ఇబ్బందులు పడుతూ ఆర్టీసి బస్సుల్లో ప్రయాణం కంటే ప్రయివేటు వాహనాలను ఆశ్రయించడం బాగుందని ప్రయాణీకులు చర్చించుకుంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచి ప్రయాణీకులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేలా చూడాల్సిన అవసరం ఆర్టీసి అధికారు, పాలకులపై ఉందని చెప్పవచ్చు.

# అంకితభావంతో విధులు నిర్వహించాలి

-నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవు : సిపి డా॥అనురాధ



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ డా॥అనురాధ

**సిద్దిపేట,ప్రభాతవార్త ప్రతినిధి:**

ధర్నాలు, రాస్తారోకోలు చేపట్టినప్పడు పోలీసు అధికారులు, సిబ్బంది శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా త్వరగా రియాక్టు కావాలని విధి నిర్వహణలో అలసత్వం వహించొద్దని సీపీ డా॥అనురాధ ఆదేశించారు. క్యూఆర్టీ(క్విక్ రియాక్షన్ టీమ్స్)తో శుక్రవారం సీపీ కార్యాలయంలో నిర్వహించన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో ఎక్కడ ఏదైనా సంఘటన జరిగిన క్యూఆర్టీ టీమ్స్ వెంటనే చేరుకోవాలని సూచించారు. ప్రజల ధనమాన ప్రాణ రక్షణకు మనం ఉన్నామని భరోసా కల్పించాలన్నారు. అంకితభావంతో విధులు నిర్వహించాలని నిర్లక్ష్యం చేస్తే శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. అంకితభావతంతో విధులు నిర్వహించే అధికారులను, సిబ్బందిని గుర్తించి ప్రతి నెల రివార్డులు అవార్డులు అందించడం జరుగుతుందన్నారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు రామచంద్రరావు, సుభాష్‌చంద్రభోస్, కిరణ్, లక్ష్మీబాబు, ఉపేందర్, విద్యాసాగర్, ధరణికుమార్, పూర్ణచందర్,రాజేష్, వెంకటరమణ,రంజిత్, క్యూఆర్టీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విజృంభిస్తున్న విష జ్వరాలు



ప్రైవేట్ ఆసుపత్రికి బారులు తీరిన రోగులు

**కంగ్టి, ఆగస్టు 23 ప్రభాతవార్త:**

కంగ్టి మండల పరిధిలోని ఆయా గ్రామాలు, తండాల్లో విష జ్వరాలతో బాధపడుతూ కూలినాలి చేసుకుంటూ వచ్చిన డబ్బులతో ఆసుపత్రి కి వెచ్చించడం జరుగుతుందని వాపోతున్నారు. మండల కేంద్రమైన ప్రైవేట్ ఆసుపత్రి ఆర్ఎంపీ డాక్టర్ దగ్గర జనాలు బారులు కడుతున్నారు మండలానికి సుమారు చుట్టు పక్కల గ్రామాలు ఆరు నుంచి పది కిలోమీటర్ల దూరంలో ఉంటుందని వృద్ధులు నడవలేని స్తితిలో మంచానికి పరిమితం అయ్యారని తెలిపారు. ఎట్టకేలకు ప్రతి ఒక్కరికి ఐదు నుంచి ఆరు రోజుల వరకు జ్వరాలు తగ్గడం లేదని, జ్వర బాధితులు చేబుతున్నారు. ఆర్ఎంపీ డాక్టరును సంప్రదించగా ప్రతి ఒక్కరికి వైరల్ జ్వరం , మలేరియా, టైపాయిడ్, నిర్ధారణ అయ్యాయని ఇప్పటి వరకు డెంగ్యూ నమోదు కాలేదని తెలిపారు. దూర ప్రాంతం నుంచి రావడం ఉదయం మరియు సాయంత్రం వేళల్లో సూది తీది తీసుకవడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం, గ్రామాల్లో తుర్కవడగామ్, రాజాంరాం తండా, ముకుందనాయియక్ తండా, సాధుతండా, సుక్కల్‌తీర్థ్, సర్దార్‌తండాల్లో విష జ్వరం ఎక్కువగా ఉందని గ్రామస్థులు తెలిపారు గ్రామాల్లో హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు.

# డిఫెన్స్ నకిలీ మద్యం బాటిళ్ల పట్టివేత

-44 బాటిళ్లు, కారు స్వాధీనం



పోలీసులు అదుపులో డిఫెన్స్ నకిలీ మద్యంను తరలిస్తున్న వ్యక్తి

**జహీరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** డిఫెన్స్ నకిలీ మద్యం బాటిళ్లను (44 బాటిళ్ల)ను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లు, కారును సీజ్ చేసినట్లు ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలహాసన్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ హరికిషన్, అసిస్టెంట్ కమిషనర్ ఎం శ్రీనివాస్‌రెడ్డి, సూపరిండెంట్ నవీన్ చంద్రలు తెలిపారు. కర్ణాటకలోని బీదర్ పట్టణం నుంచి హైద్రాబాద్‌కు అక్రమంగా 44 నకిలీ డిఫెన్స్ మద్యం బాటిళ్లను కారులోతరలిస్తుండగా మండల పరిధిలోని కొత్తూర్(బి) గ్రామ శివారులో విశ్వసనీయ వర్గా సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. కారులో 100 పేపర్ బాటిల్స్‌తో పాటు బ్లాక్ ఆండ్ వైట్ మద్యం బాటిళ్లు దొరికాయన్నారు. మద్యం బాటిళ్లు, కారు విలువ 7లక్షల 30వవేల విలువ ఉంటుందన్నారు.

# పోస్ట్‌మెన్‌ను మార్చాలంటూ మహిళల ఆందోళన



లింగాపూర్ లో పింఛన్, ఉపాధీ హామీ డబ్బుల కోసం పడిగాపుల కాస్తున్న మహిళలు. అనంతరం ఆందోళనకు దిగిన మహిళలు తదితరులు

**నర్సాపూర్ అగస్టు 23. ప్రభాతవార**

ఈ పోస్ట్‌మెన్ తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఈమేరకు ఈ పోస్ట్‌మెన్ వెంటనే మార్చాలని డిమాండ్ చేస్తు నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం పలు గ్రామాల మహిళలను పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈసందర్భంగా మహిళలు మాట్లాడుతూ మండల పరిధిలోని లింగాపూర్, నారాయణపూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల మహిళలకు ఉపాధీ హామీ డబ్బులు, పింఛన్ డబ్బులు ఇవ్వడంలో సతాయిస్తున్నాడని తెలిపారు. అయితే వారం రోజులుగా లింగాపూర్ నకు వచ్చి తిరుగుతున్నా పడిగాపులు కాస్తున్నా పట్టించుకోక పోగా డబ్బులు ఇవ్వవడం లేదని వారు ఆరోపించారు.ఈ పోస్ట్ మెన్ నిర్లక్ష్యం వల్ల తమకు సకాలంలో పింఛన్ డబ్బులు, ఉపాధీ హామీ కూలీ డబ్బులు అందడం లేదని వారు వాపోయారు. ఈ పోస్ట్‌మెన్ తో ఆనేక ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటు వెంటనే ఈ పోస్ట్‌మెన్ ను మార్చాలని వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారుల స్పందించి ఈ లింగాపూర్ గ్రామానికి కొత్తగా మరో పోస్ట్ మెన్‌ను నియమించి తమ ఇబ్బందులను తొలిగించాలని పలు గ్రామాల మహిళలు కోరుతున్నారు.

# అక్రమ ఇసుక డంపుల సీజ్

-ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు



ఇసుక డంపులను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

**ములుగు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**

ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండల పరిధిలోని వంటిమామిడి రాజీవ్ రహదారి సమీపంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు, వే బిల్లులు లేకుండా ఇద్దరు వ్యక్తులు 250 టన్నుల ఇసుకను అక్రమంగా డంపు చేశారని నమ్మదగిన సమాచారం రావడంతో ములుగు పోలీసులతో కలిసి ఇసుక డంపులను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇసుకను అక్రమంగా డంపుచేసిన ఇద్దరిపై ములుగు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, మొరము, మట్టి అక్రమ రవాణా చేసినా మరియు జూదం, పేకాట, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా,కలిగి ఉన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులకు 8712667445, 8712667447, 8712667446 నెంబర్లకు సమాచారం అందించాలని, సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# కొనసాగుతున్న ఫీవర్ సర్వే



శాలిపేటలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

**చిన్నశంకరంపేట,ఆగస్టు 23,ప్రభాతవార్త:**

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని మండల వైద్యాధికారి సాయి సింధూ అన్నారు. మండల పరిధి శాలిపేటలో యువకుడు డెంగితో మృతి చెందగా రెండు రోజులుగా గ్రామంలో వైద్య శిభిరాన్ని నిర్వహిస్తున్నారు. గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహించి జ్వరంతో బాధపడుతున్న వారికి మందులను అందించినట్లు తెలిపారు. 209 ఇండ్లను పరిశీలించి నిల్వ ఉన్న నీటిని తొలగించినట్లు తెలిపారు. జ్వరం వచ్చిన వారి ఇంటి వద్దకు వైద్య సిబ్బంది పర్యవేక్షిస్తారని అన్నారు. కార్యక్రమంలో వైద్యుడు హృదయ్, సీహెచ్‌వో యాదగిరి, ఏఎన్ఎంలు స్వప్న, ప్రియాంక,, మాల, నర్సింలు పాల్గోన్నారు.

# కళ్యాణ లక్ష్మి పేదింటి ఆడబిడ్డలకు వరం

-మెదక్ పట్టణంలో 38 మంది, మెదక్ మండలంలో 40 మందికి అందజేత
-మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

**సంగారెడ్డి బ్యూరో, ఆగస్టు23 ప్రభాతవార్త:**

కళ్యాణ లక్ష్మీ పథకం పేదింటి ప్రజలకు వరం అని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో మెదక్ పట్టణంతో మెదక్ మండలానికి సంబంధించిన 78 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మీ పథకం పేదింటి ప్రజలకు వరం అని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన హామినిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేరూరు శంకర్, శ్రీనివాస్ చౌదరి, గుట్టకిందిపల్లి మాజీ సర్పంచి చింతల వెంకట్, మాజీ ఎంపీటీసీ ప్రభాకర్, యాదాగౌడ్, మాజీ బాలనగర్ ఉప సర్పంచి, పాతూరు సిద్ధయ్య, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరి ఆంజనేయులు, చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ దాయర లింగం, దొంతి లక్ష్మీ ముత్యంగౌడ్, బొద్దుల రుక్మిణి కృష్ణలతో పాటు మెదక్ మండల తహశీల్దార్ లక్షణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరువు ,దౌల్తాబాద్ రహదారి విస్తరణ చేపట్టాలి



సంతకాల సేకరణ చేపడుతున్న సిఐటియూ నాయకులు

**పటాన్‌చెరు,ఆగస్టు 23,ప్రభాతవార్త:**

పటాన్‌చెరు నుండి ఇంద్రేశం మీదుగా దౌల్తాబాద్ వెళ్లే ఆర్ అండ్ బి రహదారి విస్తరణ చేపట్టాలని, గుంతలు పడిన రోడ్డుకు వెంటనే మరమ్మత్తులు చేయాలని సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఇంద్రేశం దర్గా వద్ద సిఐటియూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటియూ జిల్లా ఉపాధ్యక్షులు బి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంద్రేశం రహదారి పూర్తిగా పెద్ద గుంతలు అయి వాహదారులు నరకం చూస్తున్నారన్నారు. ఈ ప్రాంతం దిన దిన అభివృద్ధి చెందుతుందని, ముఖ్యంగా జీఎంఆర్ రహదారి పూర్తిగా గుంతలమయం అయి వాహనాలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ముత్తంగి రింగు రోడ్డు నుండి శివనగర్ చౌరస్తా వరకు రోడ్డు విస్తరణ కోసం 20 కోట్ల రుపాయలు హెచ్ఎండిఎ ప్రతి పాదనలు పంపి, మంజూరు చేసిన రహదారి విస్తరణకు నోచుకోవడం లేదని మండిపడ్డారు. ప్రస్తుతం గుంతలు పూడ్చేందుకు 3 కోట్ల రుపాయలు ప్రతిపాదనలు పంపిన ఎలాంటి పురోగతి లేకపోవడం దారుణమన్నారు. అర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం వలన రోడ్డు మిద అనేక ప్రమాదాలు జరుగుతున్న పట్టించుకున్న పాపాన పోవడం లేదని ఆరోపించారు. భారీ వాహనాలు,బస్సులు,ఆటోలు ఇతర వాహనాలతో ఈ రహదారి నిత్యం రద్దీగా ఉంటుందన్నారు. గతంలో ధర్నా,నేడు సంతకాల సేకరణ కార్యక్రమాలు చేస్తున్నట్లు, రహదారి విస్తరణ చెపట్టే వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీఐటీయూ నాయకులు, ఎస్ సురేష్ కుమార్, సురేష్, వరప్రసాద్, శ్రీనివాస్,రాములు, రామక్రిష్ణ, సురేష్, సాగర్, నరేంద్ర, వీరయ్య, శ్రీనివాసరావు, నవీన్‌లు పాల్గొన్నారు.

# గజ్వేల్‌లో ఉద్యోగుల నిరసన

**గజ్వేల్, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**

ఉద్యోగుల పాత పెన్షన్ విధానాన్ని కాలరాస్తూ గత ప్రభుత్వం 2014 ఆగస్టు 23న జివో 28ని తీసుకురాగా టిఎస్‌సిపిఎస్‌ఈయు ఆధ్వర్యంలో శుక్రవారం గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ సమీకృత కార్యాలయంలో ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించి జివో 28ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మల్లికార్జున్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజు, గజ్వేల్ మండల అధ్యక్షుడు షేక్ బిలాల్, కమలాకర్, లవకుమార్, మల్లేశం, అశ్రఫ్, ఉపేంద్ర, నరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సిసి రోడ్లను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లను మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య శుక్రవారం పరిశీలించారు. సిసి రోడ్ల నిర్మాణంలో నాణ్యత లోపం లేకుండా చూడాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అలాగే 4వ వార్డులో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పొదలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీధర్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

-రైతులే లేని బిఆర్ఎస్ ధర్నా -కాంగ్రెస్ నేతల ఎద్దేవా

**గుమ్మడిదల, ఆగస్టు23 ప్రభాతవార్త:**

రెండు లక్షల రుణమాఫీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఘనత చరిత్రలో మిగిలిపోతుందని స్థానిక కాంగ్రెస్ నేతలు అన్నారు. శుక్రవారం స్థానిక గుమ్మడిదల మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పలువురు మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ రుణమాఫీ చేసింది మిత్తి పైసలే అని అన్నారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలలో బీఆర్ఎస్ పార్టీ చేయని పని కాంగ్రెస్ పార్టీకి ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత దక్కుతుందన్నారు. గతంలో చంద్రబాబు, కేసీఆర్ ప్రభుత్వాల్లో రైతుల సంక్షేమం కోసం ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేసి లాఠీ దెబ్బలు తిన్నామని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా మార్కులు వచ్చాయని అన్నారు. మాజీ సర్పంచి తులసీదాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ నిర్వహించిన ధర్నాలో రైతులు పాల్గొనలేదని అన్నారు. మాజీ ఉప సర్పంచి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులకు సిగ్గు లేకుండా మాట్లాడటం తగదని అన్నారు. ఇక నుంచి కాంగ్రెస్ పార్టీ అంటే ఏంటో చూపిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు మద్ది ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ హరీష్‌రావు రాజీనామా చేసి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. సోలక్‌పల్లి మాజీ స్పంచి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ధైర్యం ఉంటే బీఆర్ఎస్ పార్టీ నాయకులు కండువా మార్చకుండా పది సంవత్సరాలు ఉండాలన్నారు. జిన్నారం మండల పార్టీ అధ్యక్షులు వడ్డె కృష్ణ మాట్లాడుతూ హరీష్‌రావు మాట మీద ఉండి రాజీనామా చేయాలని, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్ని రోజులు ఉంటారో మీకే తెలియదని అన్నారు. రుణమాఫీ కాని రైతులు వ్యవసాయ అధికారులను కలిస్తే మాఫీ చేస్తారన్నారు. రైతులు అయోమయ పరిస్థితికి గురి కావద్దని, రైతులు ఆందోళన చెందవ్వని సమావేశంలో వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు పుట్ట నర్సింగరావు, జిన్నారం మండల అధ్యక్షులు వడ్డే కృష్ణ, మాజీ అధ్యక్షులు మద్ది వీరారెడ్డి, మద్ది ప్రతాప్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచి నరేందర్‌రెడ్డి, పెంటారెడ్డి, మాజీ సర్పంచి తులసీదాస్, పడమటి లక్ష్మారెడ్డి, భిక్షపతిరెడ్డి, ఆకుల ఆంజనేయులు, బాలకృష్ణ, రాజిరెడ్డి, సుధాకర్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లలిత, వీరేందర్‌రెడ్డి, నర్సింలు, సూరారం మహేష్, సందీప్, భిక్షపతి, జంగారెడ్డి, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత పోస్టల్ శాఖ పథకాలు సామాన్యుడికి ఎంతో మేలు

**-గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్**



ప్రసంగిస్తున్న గాంధీనగర్ కార్పొరేటర్ పావనీ వినయకుమార్

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** భారత పోస్టల్ శాఖ అమలు చేస్తున్న పథకాలు, సేవలు వినియోగించుకోవడం ద్వారా ప్రజలు ఆర్థిక సాధికారత పెంపు సాధ్యమవుతుందని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని జనప్రియ అబోడ్స్ అపార్ట్‌మెంట్‌లో శుక్రవాకం భారతతపాలశాఖ ఆధ్వర్యంలో 'డాక్ కమ్యునిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం(డిసిడిపి) జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ పావనీ వినయకుమార్ మాట్లాడుతూ మహిళలు, ఆడపిల్లలకు భవిష్యత్తులో పురోగతి సాధించాలన్న, జీవనశైలిలో అభివృద్ధి చెందాలన్న పోస్టల్ శాఖ అమలు చేసే పథకాలు వినియోగించుకోవాలన్నారు. పొదుపు ప్రయోజనాలతో పాటు, బీమా సౌకర్యం కల్పించే అద్భుతమైన పథకాలు, 'బాల్‌జీవన్ పథకం', 'జీవిత భీమ, ఆరోగ్యబీమా, పెన్షన్ స్కీంలను సేవింగ్స్ ఖాతాలతో అనుసంధానం చేసే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. దగ్గర్లోని పోస్ ఆఫీస్‌ను సందర్శించి ఈ సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పోస్టల్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సాగర్ దండపూడి, గాంధీనగర్ పోస్టు ఆఫీస్ పోస్టు మాస్టర్ ఫిరోజ్ ఖాన్, జనప్రియ అబోడ్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వామిదాస్, మల్లేష్, కోశాధికారి చంద్రకళ, కమిటీ సభ్యులు, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక భావాలతో ముందుకు సాగితే జీవితం ఆనందమయం

**-ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్**

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావాలతో ముందుకు సాగితే జీవితం ఆనందంగా ఉంటుందని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. శుక్రవారం గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం అంగరంగ వైభవోపేతంగా సాగింది. ముందుగా గణపతి హోమం అనంతరం విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ముఠాగోపాల్ హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిఆర్ఎస్ యువనేత ముఠాజైసింహ, డివిజన్ పార్టీ అధ్యక్షుడు రాకేశ్, కాంగ్రెస్ పార్టీ నేత సాయికీర్త(బాబ్జీ), న్యాయవాది శ్రీనివాస్, కమిటీ సభ్యులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, కైరంకొండ నర్సింగ్, తీగల శ్రీనివాస్, దేవరాజ్, రాజయ్య, చందు, యాదగిరి, బాబు, వంశీకృష్ణ, నాగుల ప్రకాశ్, నవీన్, ప్రవీణ్, శ్రీకాంత్, ధనంజయ్, చోటు, రామ్‌చందర్, చరణ్, మహిళలు, పాల్గొన్నారు.

## సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలి

**-ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో నిరసన**



**అత్తాపూర్ ఆగస్టు23,ప్రభాతవార్త :** నూతన రాష్ట్రంలో 2014 ఆగస్టు 23న జిఎంఎస్ నెం 28 ద్వారా గత ప్రభుత్వం సిపిఎస్ విధానాన్ని కొనసాగిస్తూ అగ్రిమెంట్ చేసుకున్న రోజుకు నిరసనగా శుక్రవారం ఉద్యోగుల పాలిటీ చీకటి రోజులుగా భావించి బ్లాక్‌డేగా జరుపుకున్నారు.సెంట్రల్ సిపిఎస్ కమిటీ పిలుపు మేరకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ సిపిఎస్ ప్రెసిడెంట్ పరమేశ్వర్ ,సిపిఎస్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ విదులకు హాజరయ్యారు.భోజన విరామ సమయంలో జిఓఎంఎస్ నెం28 ప్రతులను దగ్ధం చేసి,ఉద్యోగ,ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో కొత్తగా ఎన్నికైన ప్రభుత్వం వారి ఎన్నికల మేనిఫెస్టో పెట్టిన విధంగా సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపిఎస్ పాత పెన్షన్‌ను ఇవ్వాలని ఉద్యోగ,ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టీచింగ్ ప్రెసిడెంట్ డా.బి. విద్యాసాగర్,నాన్ టీచింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ యాదవ్, సిపిఎస్ సెంట్రల్ కమిటీ మెంబర్ డాక్టర్ సురేష్,ఇతర ఉద్యోగులు కిరణ,సుమలత,కవిత,ఆయేషా,మినాక్షిం,జహంగీర్ ,మాధురి,రేణుక,నరేందర్,విజయ్,కాలేజీ ఉద్యోగులు శ్రీధర్ పార్వతి,హుస్సేన్,ఎఆర్ఐ రాజు ,డ్రైవర్స్ సంఘం,ఉద్యోగ సంఘాలు,తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ పోలీసుల సేవా కార్యక్రమాలు



**అత్తాపూర్ ఆగస్టు23,ప్రభాతవార్త :** ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు,చలాన్‌లు వేయడానికి పరిమితమైతారను కుంటే పొరపాటే..రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా పనిచేస్తున్న ప్రేమిలా వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా సేవా కార్యక్రమాలను చేస్తున్నారు. మైలర్‌దేవ్‌పల్లి చౌరస్తాలో రోడ్డుపై గుంతలు ఏర్పడగా శుక్రవారం అటుగా వెళ్తున్న రెడిమిక్స్ వాహనాన్ని ఆపి అందులో నుంచి సిమెంట్ తీసుకొని రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను ట్రాఫిక్ సిబ్బందితో పూడ్చివేసి తన సేవా దృక్పథాన్ని చాటుకున్నారు. ఇదేవిధంగా మూడు రోజుల క్రితం ఆరాంఘర్ చౌరస్తాలో ఒక వికలాంగున్ని రోడ్డు దాటించి అతను వెళ్లాల్సిన బస్సును ఎక్కించి ట్రాఫిక్ ఎఎస్ఐ ప్రమీల మానవతను చాటుకున్నారు.ఇలాంటి పోలీసులకు సెల్యూట్ చేయాల్సిందే.

## విద్యార్థులకు రైన్‌కోట్స్ అందజేత

**బేగంబజార్,ఆగస్టు23ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్దులను ఆదుకోవడమే కాకుండా,నూతన టెక్నాలజీతో కంప్యూటర్ విద్యను అందచేసి యంగిస్తాన్ ఫౌండేషన్ వాలంటీర్ ప్రతిక్ష సాలియన్ ఉద్బోదించారు. ఏ.వి.ఐ. ఎస్‌పిఎల్ కంపెనీ స్పాన్సర్ చేయగా యంగిస్తాన్ ఫౌండేషన్ ఎన్‌జిఓ కళ్యాణ్ ముంబైవ్యవస్థాపకులు మితిలేస్ జూవాలంటీర్ ,సామాజిక కార్యకర్త దేవేరా మనోజ్క్న ఆధ్వర్యంలో నాంపల్లిలోని ఆంధ్రవిద్యాలయం ఉన్నత పాఠశాలకు రెండు కంప్యూటర్లు అందచేసి,పాఠశాల విద్యార్ధీనులకు రెయిన్ కోట్స్ అందచేశారు.ప్రభుత్వ పాఠశాల విద్యాను అభ్యసించే విద్యార్దులను ఆదుకోవడమే తమ సంస్ధ ప్రధానధ్యేయమన్నారు.

# 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ అవార్డు

**-ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి**



హరికథా భాగవతారిణి పద్మశ్రీ 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ పురస్కారం అందిస్తున్న ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి

**చిక్కడపల్లి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** సామాన్యులు మరణం చితితో ముగిస్తే మహనీయుల మరణం తర్వాత జ్యోతిలా వెలుగుతారని పూర్వ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి అన్నారు. ప్రజానటిగా కలాభారతిగా సుప్రసిద్దులు అని అన్నారు. శుక్రవారం రాత్రి వంశీ ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో ప్రజానటి, కలాభారతి, పూర్వ లోకసభ సభ్యురాలు డాక్టర్ జమున రమణారావు 88వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రముఖ సాంస్కృతిక హరికథా భాగవతారిణి పద్మశ్రీ 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ పురస్కారం-2024 ప్రదానోత్సవ సభ నిర్వాహక సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు, వంశీ అధ్యక్షురాలు డాక్టర్ తెన్నేటి సుధాదేవి, మేనేజింగ్ ట్రస్టీ సుంకరపల్లి శైలజ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో జరిగింది. ముఖ్యఅతిథిగా డాక్టర్ కె.వి.రమణాచారి హాజరై ఈ పురస్కారాన్ని ప్రముఖ సాంస్కృతిక హరికథా భాగవతారిణి పద్మశ్రీ 'ఉమామహేశ్వరి'కి 'జమున-వంశీ జాతీయ పురస్కారం-2024 ప్రదానం చేసి ప్రసంగించారు. భారతీయ చలనచిత్రరంగంలో 25ఏళ్ళ పాటు ఏకైక కథానాయికగా వెలుగొందిన స్త్రీమూర్తి జమునా రమణారావు అని అన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రమణాచారి మాట్లాడుతూ లోకసభ సభ్యురాలిగా, సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలిగా ఒక మహానటిగా వెలుగొందారని, అన్నింటికంటే ఒక మంచి వ్యక్తిగా పేరును సంపాదించారని, ఇటువంటి కీర్తిప్రతిష్టలు సంపాదించిన జమునా రమణారావు అంత్యక్రియలు నిర్వహించకపోవడం వెనుక తనకుఇప్పటికే అనుమానం వ్యక్తం అవుతోందన్నారు. జమున మరణించిన సమయంలో ఆనాటి ప్రభుత్వం అధికార లాంఛనాలతో అధికార లాంఛనాలతో చేయకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఇకముందైనా తమ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకుని ముందుకు సాగిన వారు మరణిస్తే నిలదీయాల్సిన బాధ్యత సమాజానికి ఉందని అన్నారు. ప్రముఖ రచయిత్రి డాక్టర్ కె.వి.కృష్ణకుమారి, ప్రముఖ నాట్యగురువు డాక్టర్ కళాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఓలేటి పార్వతీశం మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర రంగంలో అఖండ జ్యోతిగా వెలిగిన గొప్ప సినీ నటీ జమునా రమణారావు అని ఓలేటి పార్వతీశం అని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 'మీరజాలగలడా నాయావతి' పేరుతో జమున నటించిన చిత్రాల నుంచి సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు వైఎస్.రామకృష్ణ, సాయిమేఘన, తుషార నిలయ, వీణ, గంటి శైలజ, నేమాన లలిత తదితరులు గానం చేశారు.

## నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలి : మహేందర్‌గౌడ్




బండ్లగూడ కార్పోరేషన్ 22.వ,వార్డులో నీటి సమస్యపై జల మండలి అధికారులతో చర్చిస్తున్న మాజీ మేయర్ మహేందర్‌గౌడ్.

**నార్సింగి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని 22.వ,వార్డు పరిధిలో నీటి సమస్య తీవ్రరూపం దాల్చిందని, వెంటనే పరిష్కరించి, ప్రజలకు మేలు చేయాలని మాజీ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ జల మండలి అధికారులకు సూచించారు. శుక్రవారం 22.వ,వార్డులోని పలు కాలనీల్లో జల మండలి అధికారులతో కలిసి మహేందర్‌గౌడ్ పర్యటించారు. నీటి ఎద్దడితో తాము పడుతున్న ఇబ్బందులను పలు కాలనీల మహిళలు అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్‌గౌడ్ మాట్లాడుతూ జల మండలి అధికారులు వారానికి ఒక సారి నీటిని సరఫరా చేస్తుండడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సవ్యంగా నీటిని సరఫరా చేస్తే నీటి బిల్లులు చెల్లించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వర్షాకాలంలో సైతం వారానికి ఒక సారి నీటిని సరఫరా చేయడం దారుణమని మండి పడ్డారు. బడాబాబులుండే విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలకు నిత్యం నీటిని సరఫరా చేస్తున్న జల మండలి అధికారులు సామాన్య ప్రజలుండే గ్రామాలు, కాలనీలకు వారానికి రెండు రోజులు కూడా సరఫరా చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రజలు చెల్లిస్తున్న పన్నులతోనే అధికారులు జీతాలు పొందుతున్న సంగతి మరిచిపోకూడదని, తాము తింటున్నది ప్రజల సొమ్మని గుర్తుంచుకోవాలన్నారు. వేగంగా నీటి సమస్యను పరిష్కరించాలని లేదంటే జల మండలి కార్యాలయంను ముట్టడిస్తామని మహేందర్‌గౌడ్ హెచ్చరించారు. మాజీ మేయర్, మహిళలు చెప్పిన నీటి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని, వారంలో రెండు రోజులు నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని జల మండలి జిఎం మహేందర్ నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జల మండలి అధికారులు ఎలమయ్య, మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సుద్దాల అశోక్‌తేజకు జాతీయ స్థాయిలో అవార్డు

**చిక్కడపల్లి,ఆగస్టు 23 ప్రభాతవార్త:** 'నేను సైతం ప్రపంచాగ్నికి' పాటను రాసిన సుద్దాల అశోక్‌తేజ జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్నారని, ఈ పాట మెగాస్టార్ చిరంజీవి నటించిన చిత్రంలోనిది కావడం ఆ చిత్రానికి ఎంతో పేరును తెచ్చిపెట్టిందని ప్రముఖ వక్తలు ప్రశంసించారు. శుక్రవారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలో రామ్‌కుమార్ కళావిందం సాంస్కృతిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్‌కుమార్ నిర్వహణలో మెగాస్టార్, పద్మవిభూషణ్ డాక్టర్ చిరంజీవి 69వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని 'చిరు' సినీ పాటల స్వరాభిషేకం' కార్యక్రమం వంశీ సంస్థల అధినేత, వంశీ గ్లోబల్ ఫిలిం అవార్డ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ వంశీ రామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా జాతీయ కవి, ప్రముఖ సినీ గేయరచయిత డాక్టర్ సుద్దాల అశోక్‌తేజను ఆత్మీయంగా సత్కరించి అభినందించారు. వంశీ రామరాజు మాట్లాడుతూ వంశీ సంస్థ సుద్దాల అశోక్‌తేజను పలు సందర్బాలలో సంస్థ పక్షాన సత్కరించిందని గుర్తుచేశారు. 'స్వరకిన్నెర' చింతలపూడి త్రినాథరావు మాట్లాడుతూ సుద్దాల హనుమంతు ఉద్యమ వారసత్వం పుణికిపుచ్చుకుననన అశోక్‌తేజ అవకాశం ఉన్న సందర్భాలలో ఉన్న సమయంలో సినిమాల్లో చైతన్య గీతాలను రాశారన్నారు. తల్లిదండ్రులు పేరిట సామాజిక చైతన్య స్పృహున్న కవులకు ప్రతియేటా అవార్డు బహుకరిస్తున్నారన్నారు. ఆత్మీయ అతిథులుగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సినీ పాటల స్వరాభిషేకంలో గాయనీ గాయకులు కాశ్యప్, నాగేందర్, శ్రీనివాస్‌రెడ్డి, 'మధుర గానమయూఖ' రేణుకా రమేశ్, సినీ నేపథ్యగాయనీ సుజాత, స్వరకళ్యాణ్, భార్గవి నాగరాజు, చైతన్య, నవిత తదితరులు అద్భుతంగా గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు.

## పేద విద్యార్థులకు బస్‌పాస్‌లు అందజేసిన రామకృష్ణారెడ్డి

**నార్సింగి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** మణికొండ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న 227.మంది విద్యార్థులకు బస్ పాస్‌లను ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి ఇప్పించారు. మణికొండ ప్రభుత్వ పాఠశాలలకు నార్సింగి, షేక్‌పేట్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు నిత్యం ఆర్టీసి బస్సులలో రాకపోకలు సాగిస్తుంటారు. వీరికి ఏడాదికి సరిపడ బస్‌పాస్ డబ్బులను రామకృష్ణారెడ్డి ఆర్టీసికి చెల్లించి 227.మందికి బస్‌పాస్‌లు తీసుకు వచ్చి పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థులకు చేయతనందించడంలో కలిగే సంతృప్తి అనంతమైందన్నారు. చాలా మంది విద్యార్థులు బస్ పాస్ డబ్బులు కూడా చెల్లించలేక ఇబ్బందులు పడుతుండడం నేను చూశానని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారంటేనే వారి ఆర్థిక పరిస్థితి అర్థమవుతుందని, అలాంటి విద్యార్థులందరికి ప్రతీ ఏటా నా సొంత డబ్బులతో బస్‌పాస్‌లు ఇప్పించడం జరుగుతుందన్నారు. అలాగే విద్యార్థులకు నోటు పుస్తకాలు, కంపాక్స్‌లు, స్కూల్ బ్యాగ్‌లు, షూస్‌లు, స్నాక్స్ కూడా పంపిణీ చేయించడం జరుగుతుందని వివరించారు. పదో తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు ప్రారంభమై, పరీక్షలు ముగిసేంత వరకు ప్రతీ రోజు సాయంత్రం స్నాక్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డికి ధన్యావాదాలు చెప్పి, షాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాణీగంజ్ డిపో మేనేజర్ శ్రీధర్, సిఆర్‌సి ఇంచార్జి ధర్మేందర్, పాఠశాల ఇంచార్జి శోభ, నాయకులు బుద్దోలు శ్రీరాములు, శ్రావణ్, గంగాధర్, ఆరిఫ్ పాల్గొన్నారు.

## తొలగించిన పర్మినెంట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

**- సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రుద్రకుమార్ యాదవ్**

**నార్సింగి, ఆగస్టు 23 ప్రభాతవార్త :** సమస్యలు పరిష్కరించాలని కోరిన పర్మినెంట్ కార్మికులపై సిబిఐటి యాజమాన్యం కక్షసాధింపు చర్యలకు దిగడం విచారకరమని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు జె.రుద్రకుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం గండిపేటలోని సిబిఐటి కళాశాల ప్రధాన గేటు ముందు సస్పెండ్ అయిన కార్మికులతో కలిసి సిఐటియు నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రుద్ర కుమార్ మాట్లాడుతూ అకారణంగా సస్పెండ్ చేసిన కార్మికులను తిరిగి విధులలోకి తీసుకోకపోతే సిబిఐటిలో పని చేస్తున్న 1062.మంది కార్మికులను ఏకం చేసి, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అన్ని కార్మిక సంఘాలతో కలిసి సిబిఐటి కళాశాల వద్ద ఆందోళన చేపడుతామని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న కార్మికుల పట్ల వివక్ష చూపడం, కక్షసాధింపు చర్యలకు పూనుకోవడం మానుకోవాలని హితవు పలికారు. విద్యార్థుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్న సిబిఐటి మేనేజ్‌మెంట్ కార్మికులకు రావాల్సినటువంటి న్యాయమైన కనీస వేతనం, ఇతర బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం దారుణమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సిఐటియు ఎంతవరకైనా పోరాడుతుందని, కళాశాలను ముట్టడించడం, ధర్నాలు చేయడం అవసరమైతే కోర్టును ఆశ్రయించి కార్మికులకు మేలు చేస్తుందని స్పష్టం చేశారు. యాజమాన్యం దిగి వచ్చి కార్మికులను విధులలోకి తీసుకోవాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రుద్ర కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో కార్మికులు సంజీవ, యాదగిరి, బాష, రమేష్, శ్రీనివాస్‌రావ్, గణేష్, ఎమ్మార్పీఎస్ నాయకులు గణేష్ పాల్గొన్నారు.

## రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే సేవాదళ్ లక్ష్యం

**-రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్**

**సైదాబాద్. ఆగస్టు 23 ప్రభాతవార్త:** రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయడమే లక్ష్యంగా సేవాదళ్ పనిచేస్తుందని తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పలువురు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు సేవాదళ్ కృషి చేస్తుందన్నారు. పనిచేసే కార్యకర్తలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పించాలని, నామినేటెడ్ పదవుల్లో సేవాదళ్ కార్యకర్తలను పరిగణనలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరుతామని అన్నారు. బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అన్ని సేవాదళ్ కమిటీలు ఇప్పటికే పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకునేందుకు ఏర్పాట్లు

**యూసుఫ్‌గూడ, ఆగస్టు 23, ప్రభాతవార్త :** గణేష్ నవరాత్రి ఉత్సవాలను శాంతి యుతంగా జరుపుకునేందుకు ఉత్సవ కమిటి సభ్యులు తమ వంతు బాధ్యతగా అన్ని జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని శ్రీవివేకానందనగర్ సేవా సమితి చైర్మన్ పులిగోళ్ళ శ్రీనువాస్ యాదవ్ అన్నారు. ఈసందర్భంగా స్థానిక కమ్యూనిటీ హాల్‌లో శ్రీవివేకానందనగర్ సేవా సమితి అధ్యక్షులు గంగుమళ్ళ వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది.ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసంవత్సరం కూడా ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి కమిటి సభ్యులు కేసవరావు, సిరికి శ్రీనువాస్, బొంతు హరికృష్ణ, జయమ్మ గారి శ్రీను, అంకమరావు, రవిందర్ రెడ్డి, గుత్తికొండ రామకృష్ణ, పవన్, వెంకటేశ్వర రావు, సత్యనారాయణ, శివరామ్, దమిడి రాజు, పులిశెట్టి శ్రీనువాస్, భూషన్‌రావు, కమ్మరి రామకృష్ణ, పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ కాలనీల్లో సిసి రోడ్లకు శ్రీకారం

**సరూర్‌నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 20వ డివిజన్ అన్నపూర్ణనగర్, శ్రీవిద్యా టౌన్‌షిప్ కాలనీల్లో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లకు శుక్రవారం మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి శ్రీకారం చుట్టారు. స్థానిక కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఆమె కాలనీవాసులతో కలిసి రోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఇ సాయి రాం, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకోవాలి : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 23 ప్రభాతవార్త :** ఉప్పల్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షునిగా ఎన్నికైన బిఆర్ఎస్ సీనియర్ నేత జెట్ట కిషోర్‌ను శుక్రవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఉత్సవాలకు ప్రభుత్వం నుంచి తగు చేయూత అందిస్తామని తెలిపారు. ఉత్సవ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకుల మహేందర్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఉత్సవాలు అంగరంగ వైభవంగా చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి నేతలు బాషపల్లి నిరంజన్‌చారి, ఏమాండ్ల రాంరెడ్డి, సుక్క కిరన్, చింతల నరసింహారెడ్డి, అలెగ్జాండర్, గౌరిగె ఐలేష్, శ్రీనివాసాచారి, బద్దం జ్ఞానేశ్వర్‌గౌడ్, సురెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బూత్కూరి రాము, బోరంపేట రాముఏ, ఆనంద్,చ అనిల్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

## రోడ్డు సమస్యను పరిష్కరించండి:చింతల

**ఎల్.బి.నగర్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** గుంతల మయంగా మారిన రోడ్లతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మరమ్మతులు చేపట్టాలని నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణాసురేంద్రనాథ్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. హయాత్‌నగర్ డిప్యూటీ కమిషనర్ యాదయ్యతో కలిసి శుక్రవారం కార్పొరేటర్ డివిజన్‌లో పర్యటించి పలు సమస్యలను పరిశీలించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బండ్లగూడ నుండి ఆనంద్‌నగర్ వరకు వేసే రోడ్ల నిర్మాణ పనులను తొందరగా మొదలుపెట్టాలని కోరారు. గుంతలరోడ్ల వల్ల రోజుకో జరుగుతుందని, త్వరగా రోడ్ల నిర్మాణ పనులను పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ రమేష్ బాబు, ఏఈ రాకేష్, వర్క్‌ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదంగా ప్రొఫెసర్ అదృశ్యం

**పంజాగుట్ట, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** అనుమానాస్పద స్థితిలో ఓ ప్రొఫెసర్ అదృశ్యమైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..క్రిష్ణానగర్‌లో నివధించే బ్రహ్మానందం(35) అమీర్‌పేటలోని సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషల్ స్టడీస్ లో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.ఈ నెల 17 వతేదీన సెంటర్‌లో ఉండగానే కొంచెం గందరగోళంగా ఉన్నాడని తోటి ఉద్యోగులు భార్యకు ఫోన్‌చేసి సమాచారం అందించారు.తర్వాత కుటుంబ సభ్యులు ఇంటికి తీసుకువచ్చారు. ఈ నెల 21 వ తేదీన ఇంట్లో ఎవరూలేని సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బ్రహ్మానందం బయటకు వెళ్ళిపోయాడు. కుటుంబ సభ్యులు అతని కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో బ్రహ్మానందం భార్య రేవతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ ఫుటేజ్ ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు.అనుమానాస్పద మిస్సింగ్‌గా కేసు నమోదు చేసుకుని జూబ్లీహిల్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మహిళ అనుమానస్పద మృతి

**దుండిగల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:** ఒంటిపై గాయాలతో ఓ మహిళ అనుమాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుండిగల్ మున్సిపాలిటీ పరిధి దుండిగల్ తాండా-2కు చెందిన జరుపాల శాంతాబాయి(45)దంపతులకు ఒక కుమారుడు, ఒక కూతురు ఉన్నారు. శాంతాబాయి భర్త, కుమారుడు కొన్నేళ్ళ క్రితం మృతిచెందగా కూతురుకు వివాహం చేయడంతో ఒంటరిగానే ఉంటుంది. తాండాలోని తన పొలంలో షెడ్డు వేసుకొని గేదెలను పెంచుకుంటూ పాలు విక్రయిస్తూ జీవనం కొనసాగిస్తుంది. రోజు మాదిరిగానే గురువారం తన పనులు ముగించుకున్న శాంతాబాయి రాత్రి పొలం వద్ద ఉన్న షెడ్డులో పడుకుంది. ఉదయం ఆమె మృతిచెంది ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆమె మృతదేహంపై గాయాలు ఉండడాన్ని గమనించి హత్యకు గురైనట్లు ప్రాథమికంగా బావించి క్లూస్‌టీమ్ రప్పించి ఆధారాలు సేకరించారు. విషయం తెలుసుకున్న డిసిపి కోటిరెడ్డి ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని దుండిగల్ సిఐ సతీష్‌ను ఆదేశించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహన్ని పోస్టుమార్టం కోసం వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఆటో దొంగతనం చేసిన నిందితుడు అరెస్టు..

**కొంపల్లి, ఆగస్ట్ 23, ప్రభాతవార్త**

ఆటోను దొంగలించిన ఓ నిందితుడిని పోలీసులు అరెస్టు చేసిన సంఘటన బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం మల్లంపేట్ రోడ్, బెంగళూరు బేకరీ, బాచుపల్లిలో కే. నర్సిములు గౌడ్ తన ఆటోను పార్కింగ్ చేశాడు. నాగర్ కర్నూల్‌కు చెందిన నిందితుడు బాబు ఆటోను దొంగలించారు. నర్సిములు గౌడ్ ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి ఆటోను రికవరీ చేసుకున్నారు. ఇతను గతంలో 18 కేసుల్లో జైలుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఇతనిపై మియాపూర్, అల్వాల్, పేట్‌బషీరాబాద్, నాగర్‌కర్నూల్, మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లలో కేసులున్నాయని తెలిపారు.

## వ్యక్తి కిడ్నాప్..



బాధితుడిని కిడ్నాపర్ల నుండి కాపాడిన పోలీసులు

**కొంపల్లి, ఆగస్ట్ 23, ప్రభాతవార్త**

వీసా మంజూరు కోసం చెల్లించిన 4 లక్షల రూపాయలు తిరిగి వాపసు ఇవ్వలేదని బాధితుడు శివ శంకర్ రెడ్డి (55)ని 8మంది కలిసి శుక్రవారం కిడ్నాప్ చేశారు. ఈ క్రమంలో అడ్డుగా వచ్చిన శివ శంకర్ రెడ్డి భార్య, కూతురు అడ్డురాగా వారిని కొట్టి, వస్తువులను ధ్వంసం చేసి ఇంట్లోకి ప్రవేశించి బీభత్సం సృష్టించారు. మెడిసన్ చదువులకై వీసాకు 4లక్షలు ఎస్ఎస్ కన్సల్టెన్సీ యజమాని శివశంకర్‌కి ఇచ్చారు. అవి వాపస్ ఇవ్వనందున ఎర్ర వీరయ్య, పోరెండ్ల దశరథ, మందాడి శ్రవణ్ కుమార్, అలుగుబెల్లి వెంకటరామ్‌రెడ్డి, బానొత్ నాగు, ఎర్ర పద్మలు కిడ్నాప్‌కు పాల్పడ్డారు. చింటమ్ ఆకాంక్ష ఫిర్యాదు మేరకు బాచుపల్లి పోలీసులు వారు చాకచక్యంగా వ్యవహరించి రాచకొండ, నల్గొండ, సైబర్ కంట్రోల్లను అలర్ట్ చేసి వెంబడించి కిడ్నాపర్లు 6మందిని సూర్యాపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. వారి నుంచి బాధితుడు శివశంకర్‌రెడ్డిని రక్షించి, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కిడ్నాపర్ల చెర నుండి విడిపించి కేసును ఛేదించినందుకు కూకట్‌పల్లి డివిజన్ ఏసీపీ, బాలానగర్ డీసీపీ బాచుపల్లి పోలీస్ స్టేషన్ ఇన్స్‌పెక్టర్, వారి సిబ్బందిని అభినందించారు.

## లారీలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

**కొంపల్లి, ఆగస్ట్ 23, ప్రభాతవార్త**

గాజులరామారం, సూరారం, ఖైసరనగర్‌ల నుండి భవన నిర్మాణ వృద్ధా మెటీరియల్‌ను తీసుకొచ్చి ప్రభుత్వ సర్వే నెంబర్ 186 భూములలో నివాస యోగ్య ప్రాంతాలకు దగ్గరలో డంప్ చేస్తుండగా 5లారీలను బాచుపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రాత్రిపూట చడిచప్పుడు కాకుండా శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం చేస్తూ ఇలా నిజాంపేట్ డబుల్ బెడ్ రూమ్ ప్రాంతాలలో స్థానికులకు ఇబ్బంది కలిగిస్తూ వేస్టేజ్ తరలిస్తున్న వారికి జరిమాన విధించడం జరిగిందని, ఇకముందు ఇలాంటివి మళ్ళీ పునరావృతం అయితే కఠినమైన చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బాచుపల్లి సిఐ ఉపేందర్ రావు తెలిపారు.

## రికవరీ మొబైల్ ఫోన్లను అందజేసిన పోలీసులు



చరవాణిలను రికవరీ చేసి పోగొట్టుకున్న వారికి తిరిగి అంజేస్తున్న పోలీసుల

**పేట్ బషీరాబాద్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త**

ఎవరైనా మీ చరవాణీలను దొంగలించినా, ఎక్కడైనా పడిపోయినా మీ దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మేడ్చల్ డిసిపి పిలుపునిచ్చారు. పేట్ బషీరాబాద్‌లోని మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో మీడియా సమావేశం శుక్రవారం నిర్వహించారు. మేడ్చల్ జోన్‌లోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో గత మూడు నెలలుగా పలు కారణాల వల్ల పోగొట్టుకున్న చరవాణీలను సెంట్రల్ ఎక్యూప్‌మెంట్ ఐడెంటిటీ పోర్టల్ సహాయంతో ట్రేస్ చేసి, 130 సెల్‌ఫోన్లను రికవరీ చేసారు. సెల్‌ఫోన్లు పోయినవారు పోలీస్ స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు బాధితులను స్టేషన్‌కు రప్పించి వారి ఫోన్లను వారికి అందించారు. వివిధ కారణాలతో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం వల్ల తిరిగి వారి ఫోన్లను పొందే అవకాశం ఉంటుందని డీసీపీ తెలిపారు. పోగొట్టుకున్న విలువైన ఫోన్లు తిరిగి తమకు అందడం, అందులోని సమాచారం అభించడం సెల్‌ఫోన్ల బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయండి



పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ నిరసన వ్యక్తం చేస్తున్న పాతబస్తీ ఐటిఐ ఉద్యోగులు

**చార్మినార్,ఆగస్టు 23 ప్రభాతవార్త :** ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పాతబస్తీ తాడ్‌బన్ ప్రభుత్వ ఓల్డ్ సిటీ సిటిఐలో శుక్రవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉద్యోగులు నిరసిస్తూ జీవో 28 ప్రతులను దగ్ధం చేశారు.ఈ సందర్భంగా టిఎస్‌పిఎస్‌ఈయు హైదరాబాద్ నగర అధ్యక్షులు కే.శ్యాంసుందర్ మాట్లాడుతూ ఉద్యోగులకు కొత్త పెన్షన్ విధానాన్ని ముడి పెట్టడాన్ని బ్లాక్‌డే గా గుర్తిస్తూ జీవో ప్రతులను దగ్దం చేశామని తెలిపారు.ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఓల్డ్ సిటీ ఐటిఐ ఉపాధ్యాయులు టి.ప్రశాంత్ రావు,ఏ.కవిత,అబ్దుల్ మాజిద్,మొయినుద్దీన్,బలరాం,అబ్దుల్ కరీం, సఫియా బేగం,ముత్యం రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నిమ్స్ ఎమెర్జెన్సీ కథ మళ్లీ మొదటికి..

-బెడ్‌లు దొరకక వెనుతిరుగుతున్న రోగులు
-వెంటిలేటర్ అయితే రావొద్దంటూ సూచనలు
-ప్రైవేటు ఆసుపత్రులతో ఒప్పందం
-ఉన్నతాధికారుల సమన్వయలోపం..
రోగులకు తప్పని కష్టాలు




**పంజాగుట్ట, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** పేదల కార్పొరేట్ ఆసుపత్రిగా పేరున్న పంజాగుట్ట నిమ్స్ ఆసుపత్రిలో రోగులకు కష్టాలు తప్పడం లేదు. మొన్నటి వరకు ఎమెర్జెన్సీ డిపార్ట్‌మెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికి బెడ్‌లు దొరికేవి. కానీ గత రెండు మూడు నెలలుగా పరిస్థితి మారిపోయింది. ఎవరైనా అత్యవసర వైద్యం కోసం వస్తే.. పడకలు ఖాళీ లేవని, ప్రైవేటుకు వెళ్లాలంటూ ఉచిత సలహాలిస్తున్నారు. కొంత మంది కింది స్థాయి సిబ్బంది, వైద్యులు ప్రైవేటు ఆస్పత్రులతో రహస్య ఒప్పందాలను పెట్టుకొని ఇక్కడి నుంచి పంపించే రోగుల ఫోన్ నంబర్‌లను అందిస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

"మెదక్ జిల్లా అందోల్ నియోజకవర్గానికి చెందిన ఓ రోగి అత్యవసర వైద్యం కోసం అర్ధరాత్రి సమయంలో అత్యవసర విభాగానికి వచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు రోగిని పూర్తిగా పరీక్షించకుండానే ఇక్కడ పడకలు ఖాళీ లేవని చెప్పారు. ప్రైవేటు, గాంధీ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. ఆ లోపే రోగి సహాయకుడికి ఓ ప్రైవేటు ఆసుపత్రి నుంచి ఫోన్ వచ్చింది. నిమ్స్‌లో బెడ్‌లు ఖాళీ లేక అడ్మిషన్ చేసుకోలేదంట కదా.. ఇక్కడికి వస్తే మేము ట్రీట్‌మెంట్ చేస్తామని చెప్పారు. అక్కడికి వెళ్లలేక గాంధీ ఆస్పత్రికి వెళ్లారు.

" సిద్దిపేట జిల్లాకి చెందిన ఓ రోగి ఇటీవల మెడికల్ ఆంకాలజీ విభాగంలో చికిత్స తీసుకున్నారు. పరిస్థితి మెరుగుపడిందని ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశారు. పది రోజుల తర్వాత ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో కుటుంబీకులు వెంటనే అత్యవసర విభాగానికి తెచ్చారు. డ్యూటీ వైద్యులు పరీక్షించి వెంటిలేటర్ అవసరం పడుతుందేమోనని ఇక్కడ పడకలు ఖాళీ లేవని తప్పించుకున్నారు. ఓ నాలుగు గంటల పాటు వేచి ఉన్నారు. తెలిసిన వారి ద్వారా ఆస్పత్రిలోని సీనియర్ డాక్టర్‌కి చెప్పడంతో అడ్మిషన్ ఇచ్చారు. చేరిన రెండ్రోజుల తర్వాత ఆ రోగి మృతి చెందారు.

**ఇది రిఫరల్ ఆసుపత్రి.**

ఇక్కడ ఎంతో పేదలకు తక్కువ ఖర్చుతోనే వైద్య సేవలందుతున్నాయి. ప్రతీ ఒక్కరూ ఇక్కడికే నేరుగా వస్తున్నారని.. అలా రావొద్దంటూ ఓ ఉన్నతాధికారి బహిరంగంగానే చెబుతున్నారు. గాంధీ ఆసుపత్రి, ఉస్మానియా ఆసుపత్రిలకే ముందుగా వెళ్లాలలని వారు నిమ్స్‌కి వెళ్లాలని రెఫర్ చేస్తేనే రావాలంటూ చెబుతున్నారు. కొంత మంది రాజకీయ నేతలతో ఈ పరిస్థితి వచ్చిందంటూ రోగులు, వారి సహాయకులపై విరుచుకుపడుతున్నారు.

**ఓ ప్రైవేటు ఆసుపత్రితో ఒప్పందం..?**

ఎమెర్జెనీ డిపార్ట్‌మెంట్‌కి వచ్చే రోగుల కోసం అమీర్‌పేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రితో చీకటి ఒప్పందం పెట్టుకున్నారు. పేషెంట్ కండిషన్ సీరియస్ లేకపోయినా.. సీఎంవోలు బెడ్‌లు లేవని, వెళ్లిపోవాలంటూ రోగులపై మండిపడుతుంటారు. ఇక్కడ ఎంత సేపు వేచి ఉన్నా.. ఉపయోగం ఉండదని వివరాలు తీసుకొని పంపిస్తారు. కొంత సమయానికి ప్రైవేటు ఆసుపత్రి మూర్కెటటింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు ఫోన్ చేసి.. మీరు నిమ్స్‌లో బెడ్‌లు లేవని పంపించారు కదా.. ఇక్కడికి వస్తే.. మేము తక్కువ ధరకే నాణ్యమైన వైద్యం ఇస్తామని చెప్పన్నారు. వారి మాటలు నమ్మి అక్కడికి వెళ్లాక.. రోగిని ఐసీయూలో పెట్టి.. వెంటిలేటర్ అవసరం ఉందటూ లక్షల్లో బిల్లులు వేస్తున్నారు. నిమ్స్ నుంచి వెళ్లే ఒక్కో అడ్మిషన్‌కు రూ.10వేలకు పైగా కమీషన్ ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కానీ నిమ్స్‌లో చికిత్స పొంది ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా వైద్యం అందుతుంది. కానీ ఓ ఉన్నతాధికారి సహకారంతో ఇదాంతా సాగుతున్నట్లు ఉద్యోగులే చెబుతున్నారు.

**ప్రైవేట్ ఆసుపత్రులతో కుమ్మక్కు అవుతున్న కొంతమంది కిందిస్థాయి సిబ్బంది.**

**ఓ ఉన్నతాధికారి సహకారం..**

నిమ్స్‌లో సరిపోయేవిధంగా బెడ్‌లు ఖాళీలేని కారణంగా వేచి చూసిన రోగి బంధువులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. దీనికి కొంతమంది నిమ్స్ కిందిస్థాయి సిబ్బంది, ఆర్థోపెడిక్ ,యూరాలజీ తదితర విభాగాల వైద్యులు సమీపంలోని ప్రైవేటు ఆసుపత్రులకు పంపుతున్నారనే ఆరోపణలు వినబడుతున్నాయి. పెరుగుతున్న రోగులకు అనుగుణంగా బెడ్‌లు, వెంటిలేటర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని పలువురు ఆసుపత్రి సిబ్బందే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిమ్స్‌లో ఎంతో క్లిష్టతరమైన సమస్యలకు కూడా సునాయాసంగా పరిష్కారం చూపించే వైద్యులు ఉన్నప్పటికీ ఓ ఉన్నతాధికారి సహాయనిరాకరణ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వినబడుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వైద్య సేవలు ఉన్నప్పటికీ యాజమాన్యానికి చెడ్డపేరు తీసుకువచ్చే విధంగా ఆ అధికారం వ్యవహరించడం వల్లనే నిమ్స్‌లో రోగులు పడరాని పాట్లు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా నిమ్స్ ఛైర్మన్ అయిన ముఖ్యమంత్రి చొరవ తీసుకుని ఆసుపత్రిని గాడిన పెట్టాల్సి న అవసరం ఎంతైనా ఉందని పలువురు ఉద్యోగులు అభిప్రాయపడ్డారు.

## బంగ్లాదేశ్‌లో మతోన్మాద చర్యలను ఖండించాలి : విజయ్ కిషోర్

**మెహిదీపట్నం, ఆగస్టు 23, ప్రభాతవార్త :** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు మతోన్మాద చర్యని, మతోన్మాద చర్యలతో దేశం అదోగతి పాలవుతుందని, ఇలాంటి వాటిని ప్రపంచ దేశాలు ముక్తకంఠంతో ఖండించాలని కార్వాన్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు ఆనందేసి విజయ్ కిషోర్ కోరారు. శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో సంఘం సభ్యులతో పాటు మహిళలు, యువకులు, చిన్నారులతో కలిసి శ్రీగంగాపరమేశ్వరి దేవాలయం నుంచి పురానాపూల్ చౌరస్తా వరకు శాంతియుత క్యాండిల్ ర్యాలీ, జాతీయ జెండాలతో ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనందేసి విజయ్ కిషోర్ మాట్లాడుతూ..బంగ్లాదేశ్‌లోని హిందువులు, హిందూ ఆలయాలను ధ్వంసం చేయడాన్ని హిందువులంతా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇలాంటి సందర్భాల్లో హిందువులంతా ఏకం కావాల్సి న అవసరం ఎంతైనా ఉందన్నారు. బంగ్లాదేశ్‌లోని హిందువుల ఆస్తులు, ఆలయాలను లక్ష్యంగా చేసుకొని మతోన్మాదులు దాడులు చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ప్రధాన కార్యదర్శి అనందేశి వేణుబాబు, గూడబోయిన శివరత్నం, గాండ్ల నీరంజన్ బాబు, గుడుమని అశోక్ కుమార్, రాస్కాస్ భగవాన్ కట్ట నర్సింగ్‌రావు, దొత్రుల శ్రీనివాస్, గంగపుత్ర సంఘం మహిళా అధ్యక్షురాలు కుదుముల స్వాతి, లావణ్య, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కార్యకర్తల బలమే బిజెపికి కొండంత అండ : బొమ్మిడాల

**కుత్బుల్లాపూర్, ఆగస్టు 23 ప్రభాతవార్త** ప్రజలకు అందుబాటులో వుంటూ నిరంతరం సమస్యల పరిష్కారానికి కృషిచేయడమే లక్ష్యంగా భరతీయ జనతాపార్టీ లోని ప్రతికార్యకర్త నడుంబిగించాలని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర సహ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బొమ్మిడాల లక్ష్మణ్ అన్నారు. నూతనంగా పదవీబాధ్యతలు తీసుకున్న సందర్భంగా కుత్బుల్లాపూర్ డివిజన్ సంజీవయ్యనగర్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఒబిసిమోర్చ రాష్ట్ర అధ్యక్షులు గంధమల ఆనంద్‌గౌడ్ చేతులమీదుగా ప్రధానకార్యదర్శి నందనం దివాకర్‌ల చేతు మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.

# మహానగరంలో పాదచారులకు అవస్థలెన్నో..!

-రోడ్ల నిడివితో పోల్చుకుంటే 10శాతం కూడాలేని ఫుట్‌పాత్‌లు
-ఉన్న ఫుట్‌పాత్‌లపై చాలాచోట్ల వ్యాపారాలు, వాహనాల పార్కింగ్
-రోడ్డు దాటాలన్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సిందే
-ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఉన్నా చాలా వరకు నిరుపయోగమే...
-జిహెచ్‌ఎంసిలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఇలా (కి.మీ.లలో)
-మొత్తం రోడ్డు 9,013, బిటి రోడ్లు 2,846, సిసి రోడ్లు 6,167, ఫుట్‌పాత్‌లు 817

**హైదరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త** గ్రేటర్ సిటీని విశ్వనగరంగా తీర్చిదిద్దుతామంటున్న పాలకులు నగరం మధ్యలో ఫ్లైఓవర్లు, రోడ్ల విస్తరణ వంటి పనులపై దృష్టి పెడుతున్నా కాలినడకనే వెళ్లే వారికి అవసరమైన మేరకు ఫుట్‌పాత్‌లు ఫుట్ ఓవర్ బ్రిడ్జీ (ఎఫ్‌ఓబీ)ల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వనయవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పలు ప్రధాన రహదారుల్లో సాఫీగా కొద్ది దూరం కూడా నడవలేక.. ఒకవైపు నుంచి మరోవైపు రోడ్డు దాటలేక పాదచారులు పడుతున్న బాధలు అన్నీ ఇన్నీ కావు. చాలాచోట్ల ఫుట్‌పాత్‌లు లేక, ఉననన ఫుట్‌పాత్‌లు చాలా ప్రాంతాల్లో ఆక్రమణకు గురికావడంతో పాదాచారులు విధిలేని పరిస్థితుల్లో రోడ్లపైనే నడుస్తూ.. ప్రమాదాలకు గురవుతున్నారు. కిక్కిరిసిన జంక్షన్ల వద్ద రోడ్డు దాటేందుకు ప్రయత్నించే వారు కూడా రయ్‌మంటూ దూసుకుపోయే వాహనాల మధ్య ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. కొన్నిచోట్ల ఎఫ్‌ఓబీలు ఉన్నా చాలా చోట్ల లిఫ్ట్‌ల నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఈ కారణంగా పాదాచులు ఎఫ్‌ఓబీలు ఉపయోగించకుండా ట్రాఫిక్ మధ్యలోనే రోడ్లు దాటేందుకు ప్రయత్నిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. గత ఏడాది నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 123 మంది మృత్యువాత పడగా అనేకమంది గాయాలపాలవడం గమనార్హం. జీహెచ్‌ఎంసీ పరిదిధిలో మొత్తం 9,018 కి.మీ. పొడవైన రోడ్లు ఉండగా ఫుట్‌పాత్‌లు కేవలం 817 కిలోమీటర్లకే పరిమితం కావడం పరిస్థితిని స్పష్టం చేస్తోంది.

**10శాతం కూడా లేని ఫుట్‌పాత్‌లు..**

జీహెచ్‌ఎంసీ పరిధిలో బీటీ, సీసీ ఇతరత్రా రోడ్లన్నీ కలిపి మొత్తం 9013 కిలోమీటర్ల రహదారులుండగా వాటిల్లో ఫుట్‌పాత్‌లు లేదా వాక్‌వేలు కలిపి కనీసం 10 శాతం కూడా లేవు. ఉన్న ఫుట్‌పాత్‌లు దుకాణదారులు తమ అమ్మకపు సామాగ్రిని ఉంచడానికి వాహనం పార్కింగ్‌కు, టీకొట్టు, తోపుడు బండ్లు, ఇతరత్రా చిన్న వ్యాపారాల నిర్వహణకు పనికి వస్తున్నాయే తప్పా ప్రజలు నడవడానికి అనువుగా ఉండటంలేదు. ప్రభుత్వ సంస్థలు సైతం పబ్లిక్ టాయ్‌లెట్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.5 భోజన కేంద్రాలు వంటివి ఫుట్‌పాత్‌లపైనే ఏర్పాటు చేయడం గమనార్హం. కాగా కొందరు ఇసుక, ఇటుక, కంకర వంటి వాటిని సైతం ఫుట్‌పాత్‌లపైనే ఉంచి వ్యాపారాలు చేస్తున్నారు.

**రోడ్డు దాటేదెలా ?**

ఫుట్‌పాత్‌ల పరిస్థితి అలా ఉంచితే.. ఒకవైపు నుంచి మరో వైపు రోడ్డు దాటి వెళ్లాలంటే పట్టపగలే చుక్కలు కనిపిస్తాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా బిజీ రోడ్లలో ఆగకుండా దూసుకొచ్చే వాహనాలతో ఒక్క అడుగు ముందుకు వేయడం కూడా కష్టంగా ఉంటుంది. బిక్కుబిక్కుమంటూ వచ్చే వాహనాల వైపు చేతిని అడ్డంగా పెడుతూ బతుకుజీవుడా అనుకుంటూ రోడ్డు దాటుతున్నవారు నిత్యం కనిపిస్తుంటారు. ఇక గ్రామీణ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చిన వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఎవరో ఒకరు తోడుంటే వారు రోడ్డు దాటలేని పరిస్థితి ఉంటోంది. పాదచారులు రోడ్డు దాటేందుకు ఫుట్‌ఓవర్ బ్రిడ్జీలు సెలికాన్ సిగ్నల్స్ వంటివి ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం చెబుతున్నప్పటికీ కోట్ల రూపాయలు ఖర్చవడం తప్ప అవి ప్రజలకు ఉపయోగపడటంలేదు. నగరంలో ఉన్న అనేక ఫుట్ ఓవర్ బ్రిడ్జీలు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. పాదాచారుల నిర్లక్ష్యం కూడా ఇందుకు కొంత తోడవుతోంది. చాలాచోట్ల లిఫ్ట్‌లు పనిచేయడం లేదు.

## ఏపి ఫెమినా మిస్ ఇండియా భవ్యారెడ్డి




**అల్వాల్,ఆగస్టు 23 ప్రభాతవార్త:** అల్వాల్ ప్రాంతానికి చెందిన భవ్యా రెడ్డి ఫెమినా మిస్ ఇండియా పోటీలో ్ల ఆంధ్రప్రదేశ్ నుంచి పోటీ చేసి ఎన్నికైయ్యారు. ఫ్యాషన్ మోడల్‌గా జీవితాన్ని ఆరంభించిన ఆమె వైవిధ్య రాణిస్తున్నారు. భరత నాట్యం పట్ల మక్కువ ఉన ్న భవ్యారెడ్డి వివిధ తెలుగు టీవి ఛానల్లో ్ల ప్రదర్శించి ఆకట్టుకుంది. అంతే కాకుండా మానసిక ఆరోగ్యం పట్ల ఎంతో మందిని ఆరోగ్య పరిస్థితులను బయటకు తీసుకు వచ్చారు. నృత్యం, సామాజిక సేవా అంశాల్లో భవ్యారెడ్డి ప్రతిభను గుర్తించి ఫెమినార్ ఇండియా ఆంధ్ర ప్రదేశ్‌కు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఫెమినార్ మిస్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌కు ఎంపిక కావడంతో చాలా సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఎసామాజిక సేవలో పాల్గొంటానన్నారు.

## ప్యారడైజ్ హోటల్ లో మంటలు

- అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది
-ముందు జాగ్రత్తగా కస్టమర్లను బయటకు తరలింపు



అగ్ని ప్రమాదం జరిగిన ప్యారడైజ్ హోటల్‌లో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది.

**బేగంపేట ఆగస్టు 23, ప్రభాతవార్త** సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్ అంటే నిత్యం ఉదయం నుంచి రాత్రి వరకు వినియోగదారులతో ఎంతో రద్దీగా ఉంటుంది. అలాంటి హోటల్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఒక్క సారిగా మంటలు, అనంతరం పొగలు రావడంతో హోటల్ సిబ్బందితో పాటు వినియోగదారులు భయాందోళనలతో బయటకు పరుగులు తీసారు.వెంటనే అప్రమత్తమైన హోటల్ సిబ్బంది ఈ సమాచారాన్ని సికింద్రాబాద్ అగ్ని మాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు.వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో భారీ ఆస్తినష్టం తప్పింది.అయితే ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణహానీ జరగలేదు.ఎవరూ గాయపడలేదు.హోటల్లో పనిచేసే ఓ యువకుడు మాత్రం స్వల్ప అస్వస్థతకు గురికావడంతో వెంటనే అతన్ని హాస్పిటల్‌కు తరలించారు.ముందుగా కిచెన్ నుంచి భారీ ఎత్తున మంటలు రావడం చూసిన హోటల్ కార్మికులు,కస్టమర్లు వెంటనే అప్రమత్తమై బయటకు పరుగులు తీసారు.అగ్ని మాపక సిబ్బంది కూడా వెంటనే సంఘటన జరిగిన ప్రాంతానికి చేరుకుని ముందుగా ప్రాణ నష్టం జరగకుండా వినియోగదారులను బయటకు పంపారు.వెంటనే మంటలను ఆర్పి వేసారు.హోటల్ కింద షార్ట్ సర్క్యూట్ జరిగిందని భావించినప్పటికీ, ఉన్న సెల్లార్ లో జనరేటర్ ఓవర్ హీట్ వల్లనే మంటలు వ్యాపించినట్లు ఫైర్ ఆఫీసర్ ప్రాథమికంగా నిర్ధారించారు.కస్టమర్లకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో హోటల్ సిబ్బందితో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఓల్డ్‌సిటీ మెట్రో రైల్ భూసేకరణ వేగవంతం..!

-ఇప్పటికే 400 ఆస్తులకు భూసేకరణ నోటిఫికేషన్లు జారీ
-మెట్రో ట్రాక్ కోసం 100 అడుగులు,
-స్టేషన్ల వద్ద 120 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ
-మెట్రో మార్గం వెంబడి ఉండే 103 మతరపమైన, సున్నితమైన కట్టడాలు
-8 నెలల్లో పూర్తికానున్న భూసేకరణ : ఎన్వీఎస్‌రెడ్డి



**హైదరాబాద్,ఆగస్టు 23 ప్రభాతవార్త** ఎంజీబీఎస్–చంద్రాయణగుట్ట మధ్య పాత నగరం మెట్రో రైల్ భూసేకరణ కార్యక్రమం వేగవంతం అవుతోంది. ఇందుకు గాను ఇప్పటికే భూసేకరణ చట్టం 2013 కింద 400 ఆస్తులకు సంబంధించిన భూసేకరణ నోటిఫికేషన్లు జారీ చేశారు. ఎంజీబీఎస్–చంద్రాయణగుట్ట మధ్య 7.5కిలోమీటర్ల నిడివిలో రోడ్డు విస్తరణ, స్టేషన్ల నిర్మాణానికి సుమారు 1200 ఆస్తులపై ప్రభావం ఉంటుందని హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు ఎంసి ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. జిహెచ్ఎంసి మాస్టర్ ప్లాన్ ప్రకారం 100 అడుగుల వెడల్పుతో రహదారి విస్తరణ జరుగుతుందని ఆయన చెప్పారు.అయితే స్టేషన్ల వద్ద మాత్రం 120 అడుగుల వెడల్పులో విస్తరణ జరుగుతుందన్నారు. దారుల్షిఫా జంక్షన్ నుండి శాలిబండ జంక్షన్ వరకు ప్రస్తుతం రహదారి వెడల్పు 50 అడుగుల నుండి 60 అడుగుల వరకు ఉండగా, శాలిబండ జంక్షన్ నుండి చంద్రాయణగుట్ట జంక్షన్ వరకు 80 అడుగుల వెడల్పు ఉందని ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. అందువల్ల దారుల్షిఫా–శాలిబండ మధ్య చాలా ఆస్తులు సేకరించాల్సి వస్తోందని, ఈ నేపథ్యంలో అక్కడ 20 నుండి 25 అడుగుల చొప్పున రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే శాలిబండ నుండి చంద్రాయణగుట్ట మధ్య ఒక్కో ఆస్తి 10 అడుగుల వరకు విస్తరణ చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్టేషన్లు, వంపు అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ఆస్తుల విషయంలో మాత్రం రహదారి విస్తరణ కాస్త ఎక్కువగా ఉంటుందన్నారు.

సాంప్రదాయంగా వస్తున్న సర్వే పద్ధతులతో పాటు 3డీలో వీక్షించే విధంగా లైడార్ డ్రోన్ సర్వే కూడా చేసినట్లు ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు. దీని వల్ల ప్రభావితం అయ్యే ఆస్తులతో పాటు చుట్టుపక్కల ఉన్న ఆస్తులను కూడా వీక్షించవచ్చని అన్నారు. ప్రభావిత నిర్మాణాల విలువను అంచనా వేసేందుకు హెచ్‌ఏఎంఎల్ ఇంజనీర్లు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో సర్వే నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ మెట్రో మార్గం వెంబడి ఉండే 103 మతరపమైన, సున్నితమైన కట్టడాల పరిరక్షణ విషయంలో అదనపు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ నిర్మానాలను విలక్షణ ఇంజినీరింగ్ పద్ధతుల ద్వారా సంరక్షించేలా పిల్లర్లు, స్టేషన్ల వద్ద జాగ్రత్తగా సర్దుబాటు చేస్తూ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఎండి తెలిపారు. ప్రభావిత ఆస్తులకు సంబంధించిన యజమానులు హెచ్‌ఏఎంఎల్ భూసేకరణ అధికారి కార్యాలయం వద్ద నిర్దిష్ట గడువులోగా తమ అభ్యంతరాలు దాఖలు చేయవచ్చని,అలాగే వీటిపై వివరాలు పొందవచ్చని ఆయన తెలిపారు. భూసేకరణ చట్టం అనుసరించి చేపడుతున్న ఈ భూసేకరణ కార్యక్రమం 8 నెలల్లో పూర్తికావచ్చని ఎన్వీఎస్‌రెడ్డి వెల్లడించారు.

## కార్మికులకు భద్రత సదుపాయాల కల్పనకు చర్యలు

-సహాయ కార్మిక శాఖ అధికారుల సమావేశం
-టిబిఓసీడబ్ల్యుడబ్ల్యుబి సీఈవో, అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్


ప్రసంగిస్తున్న తెలంగాణ భవన అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సంక్షేమ బోర్డు డాక్టర్ ఇ.గంగాధర్

**చిక్కడపల్లి,ఆగస్టు 23 ప్రభాతవార్త:** రాష్ట్రంలో భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులకు భద్రత ఇతర సదుపాయాల కల్పనకు తెలంగాణ భవన అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ సంక్షేమ బోర్డు (టిబిఓసీడబ్ల్యుడబ్ల్యుబి) ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఇ.గంగాధర్ అన్నారు. శుక్రవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో టిబిఓసీడబ్ల్యుడబ్ల్యుబి ఆధ్వర్యంలో రాష్ట్రంలో సహాయ కార్మిక శాఖ అధికారులకు బయోమెట్రిక్, ఐరిష్ పరికరాలను పంపిణీ చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా బోర్డు ద్వారా కార్మికులకు సంబంధించిన ప్రయోజనాలను క్లయిమ్ చేసే ప్రక్రియను వేగంగా, మరింత సమర్ధవంతంగా అందిచేందుకు ప్రయత్నిస్తోందని, ఫలితంగా నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ముఖ్యమైందన్నారు. త్వరితగతిన భవన నిర్మాణ రంగ కార్మికులకు సేవలను అందించాలనే సంకల్పంతో బయోమెట్రిక్, ఐరిష్ పరికరాల ద్వారా సహాయం, మద్దతు అందించేలా ముందుంటామన్నారు. ఫలితంగా కార్మికులకు సంబంధించి ఆధార్ వివరాలను త్వరగా,ఖచ్చితమైన ధృవీకరణలో సహాయపడే అవకాశాలుంటాయన్నారు. బిఓసీ కార్డు పొందిన కార్మికులకు ఎటువంటి మార్పులు చేర్పులు చేయడం లేదా అందుకు సమాచారాన్ని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం కోసం 'పాయింట్ ఆఫ్ కాంటాక్ట్' కలిగి ఉండవచ్చని, వారి సమాచారం సరైనదని, తాజాగా ఉందని నిర్ధారించుకోవచ్చన్నారు. సహాయ కార్మిక శాఖ అధికారులకు, కార్మికులకు నూతనంగా ప్రవేశపెట్టిన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా సులభతరం అవడంతో పాటు త్వరితగతిన కార్మికులకు సంబంధించిన క్లయిమ్‌లు పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు.

# అమాయకులను మోసం చేసిన వ్యక్తుల అరెస్టు..

-డబుల్ బెడ్‌రూం, ప్రభుత్వ ఉద్యోగాలు, నచ్చిన ప్రాంతంలో బదిలీ చేస్తామని నమ్మించిన కేటుగాళ్లు
-డబుల్ బెడ్‌రూం నకిలీ డాక్యుమెంటు, సెల్‌ఫోన్లు, లక్ష 97వేల నగదు స్వాధీనం..



వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు..

**నేరెడ్‌మెట్,ఆగస్టు23ప్రభాతవార్త:** ఉద్యోగాల పేరుతో అమాయకులను మోసం చేస్తున్న ముఠా సభ్యులను శుక్రవారం రాచకొండ ఎస్వోటి–1, కీసర పోలీసులు అరెస్టు చేసినట్లు రాచకొండ పోలీస్ కమీషనర్ సుధీర్ బాబు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. కుషాయిగూడ వాసవి శివనగర్ ప్రాంతానికి చెందిన అనుగు సురేందర్ రెడ్డి (34), నాగారం చండీశ్వర కాలనీకి చెందిన మెరీనా రోస్ (52), ఆత్మకూర్ మండలరం తుక్కపురం గ్రామానికి చెందిన బొలుగుల అంజయ్య (34), జమ్మిగడ్డ జైకిషన్ కాలనీకి చెందిన కత్రావత్ గోపాల్ నాయక్ (48), కీసర గోదుమకుంట ప్రాంతానికి చెందిన అనుగు హర్షిణి రెడ్డి (33)లు కలసి అమాయకులైన వారిని మోసం చేసి వారి వద్ద నుండి కోట్ల రూపాయలను దండుకున్నట్లు తెలిపారు. అనుగు సురేందర్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వ చీఫ్ అడ్వైజర్ అని చెప్పి పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులను మోసం చేసి వారికి నచ్చిన ప్రాంతాల్లో బదిలీ చేయిస్తానని 7లక్షలు, డబల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తానని చెప్పి 88లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి 10లక్షలు మొత్తం 1కోటి 5లక్షలు వరకు దండుకోవడం జరిగిందన్నారు. మెరీనా రోస్ సైతం డబల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తానని చెప్పి 12లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి 5లక్షలు మొత్తం 17లక్షలు, బొలుగుల అంజయ్య డబల్ బెడ్ రూమ్‌లు ఇప్పిస్తానని చెప్పి 2లక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి 3లక్షలు మొత్తం 5లక్షలు వరకు దండుకోవడం జరిగిందన్నారు. బండ వెంకటేష్ డబల్ బెడ్ రూం ఇప్పిస్తానని 40వేలు, గోపాల్ నాయక్ రూ. 30వేలను దండుకోవడం జరిగిందన్నారు. అనుగు సురేందర్ రెడ్డిపై ఇదివరకే పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నట్లు తెలిపారు. శుక్రవారం విశ్వసనీయన సమాచారం అందుకున్న మల్కాజిగిరి ఎస్వోటి, కీసర పోలీసులు సభ్యులను అరెస్టు చేయడం జరిగిందన్నారు. వారి వద్ద నుండి సుమారు 1లక్ష 97వేల నగదును స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసిపి మల్కాజిగిరి పద్మజ, డీసిపి ఎస్వోటి రమణారెడ్డి, అదనపు కమీషనర్ ఎస్వోటి నర్సింహ్మా రెడ్డి, ఏసిపి ఎస్వోటి శ్రీకాంత్ గౌడ్, కీసర ఇన్స్‌పెక్టర్ వెంకటయ్య, ఎస్వోటి ఇన్స్‌పెక్టర్ జంగయ్య, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలి

**ముషీరాబాద్, ఆగస్ట్ 23, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ సేవా భావంతో ముందుకు సాగాలని, అప్పుడే సమాజంలో అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందగలుగుతామని భారత్‌సేవాశ్రమ్ హైదరాబాద్ శాఖ అధ్యక్షులు స్వామి మునీశ్వరానంద అన్నారు. శుక్రవారం భారత్‌సేవాశ్రమ్‌లో దాదాపు వంద మంది జీహెచ్‌ఎంసీ సిబ్బందికి చీరలు, దుప్పట్లు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేశ్ వర్మ చేతుల మీదగా అందచేశారు. ఈ సందర్భంగా స్వామి మునీశ్వరానంద మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ కార్మికులకు అండగా ఉండటానికి ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. పేదవారికి సహాయం చేయటానికి తమ వంతు కృషి ఎల్లప్పుడూ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సేవా కార్యక్రమాలలో ముందుంటున్న భారత్‌సేవాశ్రమ్ నిర్వాహకులను గవర్నర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ కార్యదర్శి స్వామి వెంకటేశ్వరానంద, సిబ్బంది పాల్గొన్నారు.


జీహెచ్‌ఎంసీ సిబ్బందికి బట్టలు పంపిణీ చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



ఆలయ ప్రాంగణంలో గేట్లను ప్రారంభిస్తున్న ప్రముఖులు

# ముక్తికి మార్గం వైకుంఠద్వారం

## శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయంలో నూతన ద్వారాలు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఆగస్టు 23) :** ముక్తికి మార్గం వైకుంఠద్వారమని, అందుకే ముక్కోటి వైకుంఠ ఏకాదశి నాడు ఈ మార్గాన్ని అనుసరించి ముక్కోటి వైకుంఠ ఏకాదశి నాడు ఈ మార్గాన్ని అనుసరించి స్వామివారిని దర్శించుకుంటారని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే, ఆలయ నిర్వాహకులు బక్కని నర్సింహులు తెలిపారు. శుక్రవారం జానంపేట శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో బాలానగర్ ఎంపీడీఓ దండు శరత్ చంద్రబాబు, ఆయన సోదరుడు దండు వాసు సహకారంతో వైకుంఠద్వారాన్ని నూతనంగా నిర్మించారు. అదే విధంగా స్థానిక న్యాయవాది కంచిరాజగోపాల్ సహకారంతో శ్రీ పద్మనాభ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అదే విధంగా భక్తుల సహకారంతో ఆలయ ప్రాంగణంలోనూతన గేట్లను ఏర్పాటు చేశారు. వీటన్నింటినీ బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వైకుంఠద్వారంలో గోమాతద్వార ప్రవేశం చేయించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రముఖులు పాతూరి వెంకట్‌రావ్, యాదవాచారి, జగన్ మోహన్ రెడ్డి, కంచి రాజగోపాల్, వెంకట్ రాంరెడ్డి, కానుగు అనంతయ్య, కిషన్, ప్రతాప్ రెడ్డి, లట్టుపల్లి మోహన్ రెడ్డి, కేపీ, లక్కాకుల రమేష్ కుమార్, రాఘవేందర్ గౌడ్, మల్లేష్, ఒగ్గు కిషోర్, గందం ఆనంద్, బెంది సురేందర్ రెడ్డి, మురళిమోహన్, ఎద్ల సురేందర్ రెడ్డి, భూపాల్, తోకలదామోదర్ రెడ్డి, స్వాతి శివ తదితరులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్ బస్‌డిపో ముందు ధర్నా



షాద్‌నగర్ డిపోమేనేజర్ ఉషతో మాట్లాడుతున్న ఆందోళనకారులు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఆగస్టు 23) :** గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణాలకు చదువుకోవడానికి వస్తున్న విద్యార్థులకు సకాలంలో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడపాలని డిమాండ్ చేస్తూ.. షాద్‌నగర్ డిపో ముందు శుక్రవారం విద్యార్థులు బైఠాయించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. విద్యార్థులకు సరైన సమయంలో బస్సులు లేక కళాశాలలకు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిపో మేనేజర్‌కు ఎన్ని సార్లు వినతి పత్రాలు సమర్పించినా.. స్పందన లేదని ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో బస్సులు నడవకపోతే విద్యార్థుల చదువులు ఆగం అవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా డిపో మేనేజర్ స్పందించి బస్సులను సకాలంలో నడిపే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్ సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం డిపో మేనేజర్ ఉషతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ సభ్యులు భగత్, మానస, లాహరి, స్వాతిక, శాలిని, వినోద్, తరుణ్, ఆకాశ్, రాము తదితరులు పాల్గొన్నారు.

# అశోక్‌నగర్‌లో బస్తీ దర్వన్

**రామచంద్రాపురం, ఆగస్టు 23, ప్రభాతవార్త:** రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని అశోక్‌నగర్‌లో శుక్రవారం బస్తీ దర్వన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులతో కలిసి కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పాల్గొని కాలనీలో కలియ తిరిగి సమస్యలను ప్రజల నుంచి అడిగితెలుసుకున్నారు. అశోక్‌నగర్ జ్యోతి నగర్ కాలనీల మధ్యలో ఉన్న ఓపెన్ డ్రైన్ పాతదయిందని, వర్షం పడితే చెరువులా మారుతుండటంతో అవస్థలు పడుతున్నామని కాలనీ వాసులు బస్తీ దర్వన్ దృష్టికి తేగా ఓపెన్ డ్రైన్ నిర్మాణానికి 93లక్షల రూపాయలు మంజూరు చేయించినట్లు, త్వరలోనే పనులు ప్రారంభించి సమస్యను పరిష్కరిస్తామని కార్పొరేటర్ ప్రజలకు హామీ చేశారు. నేషనల్ హైవే రోడ్డు విస్తరణలో భాగంగా 100 ఫీట్లు వదిలి ఓపెన్ డ్రైన్ పనులు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో శేషరెడ్డి, ప్రమోద్ గౌడ్, ఖలీమ్, పవన్, చారి, సాంబశివరావుఉ, వసంత్‌రెడ్డి, పద్మ, మాలతీ తదితరులు పాల్గొన్నారు.

# గోవులను పూజించాలి, సంరక్షించాలి : ఎమ్మెల్యే

**నర్సాపూర్ ఆగస్టు 23. ప్రభాతవార్త:**

మన సనాతన హిందు ధర్మం ప్రకారం మనం గోవులను పూజించాలని , అదేవిదంగా వాటిని సంరక్షించాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని క్యాంపు కార్యాలయానికి వస్తున్న క్రమంలో ఈ కార్యాలయం వద్ద గోవులు తారసపడ్డాయి ఈమేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి గోవుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా నిమురుతూ ఆ గోవులకు పండ్లు ,ఫలాలను తినిపించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ హిందువులు గోమాతను పూజిస్తారని తెలిపారు. ఈమేరకు ప్రతి ఒక్కరు గోవులను సంరక్షించాలని ఆమె సూచించారు. ఈ గోవు మనకు ఎన్నోవిదాలుగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈమేరకు మనం చేసుకునే పూజల్లో గోవు పేడ, గోవు పంచితం వినియోగిస్తామన్నారు. అంతేగాక కొత్తగా నిర్మించిన ఇంటి గృహ ప్రవేశాల్లో ముందుగా గోవును కొత్త ఇంటిలో తిప్పడం మన హిందువుల ఆనవాయితీ అని పేర్కొన్నారు. ఈమేరకు గోవులను పూజించాలి, గోవులను రక్షించాలని అంటు ప్రజలకు తెలియజేశారు. గోవులు అన్నివిదాలుగా శుభ సూచకమని ఆమె అన్నారు. ఈ సమయంలో ఎమ్మెల్యే సునీతారెడినడ వెంట బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన



ఇంజనీరింగ్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్‌పి వేణుగోపాల్ రెడ్డి

**కంది, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలోని వ్యవసాయ, ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సైబర్ నేరాలు, ఎన్‌డిపిఎస్, యాంటీ ర్యాగింగ్‌పై పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెల్ డిఎస్‌పి వేణుగోపాల్‌రెడ్డి సూచించారు. సెల్ ఫోన్‌లలో గుర్తు తెలియని వ్యక్తుల ద్వార వచ్చే లింక్‌లను ఓపెన్ చేయకూడదన్నారు. కార్యక్రమంలో సిఐ అశోక్‌కుమార్, నగేష్, కళాశాల డీన్ మనోజ్ కుమార్, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పనిలేకనే మాజీ మంత్రి కెటిఆర్ పగటి వేషాలు

**బిఆర్ఎస్‌కు రుణమాఫీ గురించి మాట్లాడే అర్హతలేదు**

**8 నెలల్లోనే రైతులకు రెండు లక్షల రుణమాఫీ**

**స్థానిక ఎన్నికల కోసమే కేటిఆర్ రుణమాఫీ డ్రామా**

**రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి,**

**చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్**

**మొయినాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 8 నెలల్లో ఇచ్చినటువంటి ఆరు గ్యా రెంటీలలో ఉచిత బస్సు ఉచిత కరెంట్ గ్యాస్‌పై సబ్సిడీ రైతు రుణమాఫీ ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు ఇలాంటి పథకాలను తీసుకొచ్చిందని నాడు 9 ఏళ్ల బిఆ ర్ఎస్ పాలనలో రాష్ట్రమంతా అస్తవ్యస్తంగా చేసి ఏడు లక్షల కోట్ల అప్పు చేశారని అన్నారు. అంతేకాకుండా గత రెండు సార్లు రాష్ట్రాన్ని పాలించిన కేసిఆర్ రైతులకు కనీసం లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని రాష్ట్రంలో టిఆర్ఎస్ అధికారం నుంచి పోవడం రాష్ట్ర ప్రజలకు శని వదిలిందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టియుఎఫ్ఐడిసి చైర్మన్ చల్లా నరసింహారెడ్డి, చేవెళ్ల కాంగ్రెస్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి భీమ్‌భరత్ అన్నారు.

శుక్రవారం అజిత్ నగర్ చౌరస్తాలో ఉన్నటువం టి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేటిఆర్ రైతు రుణమాఫీ గురించి ధర్నా చేయడానికి వచ్చిన తీరును వారు తప్పుబడ్డారు. వాళ్ళపదేళ్ల అధికారంలో ఉన్నప్పు డు వారు చేసిన తప్పులనింటిని ఎండగట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉంది తెలంగాణ వచ్చినప్పటికీ మి గులు బడ్జెట్‌గా ఉన్న రాష్ట్రాన్ని కేసిఆర్‌కు అప్ప జెపివతే మిగులు బడ్జెట్ పోయి రా ష్ట్రం అతలాకుతలం చేసి ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసి ప్రభుత్వం ఉద్యోగులకు నెల ప్రారంభం ఒకటో తేదీన జీతాలు ఇవ్వలేనతం దుస్థితికి దిగజారిందని ఎద్దేవా చేశారు. కా ంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 8 నెల్లల్లోనే రెండు లక్షల రుణమాఫీ చేసి చూపించిందని సిఎం రేవంత్‌రెడ్డి పాలనచూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ తప్పుడు ఆరోపనలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్ల నరిసింహారెడ్డి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్ రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు సభ్యులు సత్యనారాయణరెడ్డి మండల అధ్యక్షుడు మానయ్య సీనియర్ నాయకులు వెంకట్‌రెడ్డి బద్రప్ప మండల ఉపాధ్యక్షుడు రవి చేవెళ్ల రాములు సాయి జైపాల్‌రెడ్డి మహేందర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న చల్లా నరసింహారెడ్డి, భీమ్‌భరత్ పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

# గుళ్లు గోపురాలు తిరగడం కాదు ఇచ్చిన మాటకు కట్టుబడి రాజీనామ చేయి

## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి: హరికృష్ణ

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త :** కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేసిందని..ఎవరికైనా సాంకేతిక లోపాలతో రుణమాఫీ కాకుంటే వెంటనే వ్యవసాయ అధికారులను సంప్రదించాలే తప్ప బిఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి ధర్నాలు,రాస్తారోకోలు చేయొద్దన్నారు. సిద్దిపేట అర్బన్ మండల పరిధిలోని బూర్గుపల్లికి చెందిన బిఆర్ఎస్ శ్రేణులు ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీలలో ఇప్పటికే కొన్ని గ్యారెంటీలను అమలు చేశారని మిగితా గ్యారెంటీలను అమలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవరం లేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీ చేస్తే రాజీనామా చేస్తానని ప్రగల్భాలు పలికిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తన పదవికి రాజీనామా చేయకుండా గుళ్లగోపారులంటూ తిరుగుతున్నారని మండిపడ్డారు. హరీష్‌రావు దమ్ము, దైర్యం ఉంటే రాజీనామా చేసి తన చిత్తశుద్దిని నిరూపిం చుకోవాలన్నారు. కార్యక్రమంలో బాలయ్య, యాదగిరి, సందీప్, బాబురావు, కలీం, బొమ్మల యాదగిరి, అంజయ్య, పద్మ, ఎర్ర మహేందర్, శ్రీనివాస్, రాజిరెడ్డి, రాజేష్‌ఖన్నా, వనజ, జనార్ధన్‌రెడ్డి, నవీన్, ప్రతాప్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# సిపిఎస్‌ను రద్దు చేయాలి-టిపిటిఎఫ్ డిమాండ్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** పాత పెన్షన్ స్థానంలో 2004 నుంచి కంట్రీబ్యూటరీ పెన్షన్ పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టి ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని తెలంగాణ ప్రోగ్రేసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా నాయకులు అన్నారు. పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యల సేకరణలో భాగంగా ఉపాధ్యాయులను ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ సిపిఎస్‌ను కొనసాగిస్తామని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం శోచనీయమన్నారు. సిపిఎస్ స్థానంలో చాలా రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్దరించాయని, అదే విధంగా దేశమంతటా పాత పెన్షన్‌ను తిరిగి పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తన మెనిఫెస్టోలో ప్రకటించిన ప్రకారం సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అనుముల రామచందర్, రాష్ట్ర కౌన్సిలర్లు సంజీవయ్య, లక్ష్మయ్య యాదవ్, సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు నాసర్ పటేల్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున్, పటాన్‌చెరు అధ్యక్షులు రాములు, కంది అధ్యక్షులు జనార్ధన్, వట్‌పల్లి అధ్యక్షులు శ్రీనివాస్‌చారి, సోషల్ మీడియా కమిటి సభ్యులు పుండరీకం, చంద్రశేఖర్, ఎ రాధ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

# రుణాలు మాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలి

**దుబ్బాక(అక్బర్‌పేట-భూంపల్లి), ఆగస్టు 23,ప్రభాతవార్త :**

రుణామాఫీ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవాలని అక్బర్‌పేట-భూంపల్లి మండల వ్యవసాయ అధికారి సత్యాన్వేష్ అన్నారు. మండలంలోని ఏఈవోలతో కలిసి శుక్రవారం రుణామాఫీ కానీ రైతుల నుంచి ధరఖాస్తులను స్వీకరించి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూ. 2లక్షలలోపు రుణాలు ఉన్న రైతులకు రుణమాఫీ చేసిందన్నారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న పంట రుణాలను అర్హులైన రైతులకు త్వరలోనే మాఫీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాల వలన రుణాలు మాఫీ కానీ రైతులు పూర్తి వివరాలతో సంబంధిత వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో లోహిత్, సమ్రీన్‌బేగం,అనుషా తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తులను సమర్పించండి**

**చిన్నశంకరంపేట,ఆగస్టు 23,ప్రభాతవార్త:** రైతు రుణమాఫీ కాని వారు దరఖాస్తులను సమర్పించాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మీ ప్రవీణ్ అన్నారు. శుక్రవారం నాడు పట్టణ కేంద్రంలోని రైతు వేదిక భవనంలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రభుత్వం అందిస్తున్న రెండు లక్షల పంట రుణ మాఫీ జమకాని రైతులు వారి దరఖాస్తులను సమర్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రుణమాఫీ డబ్బులను అందించనున్నట్లు ఆయన తెలిపారు.

# వధువుకు పుస్తె మెట్టెలు అందజేసిన ప్రముఖులు

**కొల్చారం, ఆగస్టు23 ప్రభాతవార్త:** రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రామిరెడ్డిగారి రఘువీరారెడ్డి సహకారంతో మండల కేంద్రమైన కొల్చారం గ్రామానికి చెందిన నింగోల్ల లచ్చయ్య, శివలక్ష్మీ దంపతుల కుమార్తె లాస్య వివాహానికి శుక్రవారం బీజేపీ నాయకులు పుస్తె మెట్టెలు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ బూత్ అధ్యక్షులు తమ్మలి సంతోష్ కుమార్, తిమ్మన్నగారి అనిల్ కుమార్, మండల ఉపాధ్యక్షులు రాజుగారి కృష్ణ, బీజేపీ నాయకులు నేరెళ్ల సాయి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి సహకారంతో ..**

కొల్చారం, ఆగస్టు23 ప్రభాతవార్త: మండల పరిధిలోని అంసానిపల్లి గ్రామానికి చెందిన ఎల్లనాగుల స్వరూప, భూమేష్ దంపతుల కుమార్తె భవాని వివాహానికి రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి సహకారంతో బీజేపీ నాయకులు శుక్రవారం పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు గంగాపురం రవీందర్‌గౌడ్, అశోక్, శక్తి కేంద్రం ఇన్‌ఛార్జి కమ్మరి వెంకటేశం, బూత్ ప్రధాన కార్యదర్శి కుమ్మరి శివ, మండల నాయకులు వడపల్లి రామకృష్ణ, సత్యాగౌడ్, గిరిజన నాయకులు నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

**రామిరెడ్డిగారి రఘువీరారెడ్డి సహకారంతో..**

**కొల్చారం, ఆగస్టు23 ప్రభాతవార్త:** రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు రామిరెడ్డిగారి రఘువీరారెడ్డి సహకారంతో కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామానికి చెందిన రంగి రాణి, సిద్ధిరాములు కుమార్తె అనూష వివాహానికి శుక్రవారం బీజేపీ నాయకులు పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ ప్రధాన కార్య దర్శి గుండు నాని, మండల కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు నాయికోటి మహిపాల్, మండల సీనియర్ బీజేపీ నాయకులు దాది కన్నయ్య, బసన్నగారి నాగరాజుగౌడ్, మండల యువ నాయకులు వడ్ల భాను, తేజ తదితరులు పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కును అందచేసిన మాజీ ఎమ్మెల్యే

**సిర్గాపూర్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఉజలంపాడ్ గ్రామానికి చెందిన యం ప్రియాంక అనారోగ్యం పాలయినట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి మెరుగైన చికిత్స అందుకునేందుకు సిఎంఆర్ఎఫ్ చెక్కును మంజూరు చేయించి శుక్రవారం అందచేశారు. 14వేల 5వందల రూపాయల సిఎంఆర్ఎఫ్ చెక్కును అందుకున్న ప్రియాంక్, కుటుంబ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రామ్‌రెడ్డి, తాజా మాజీ ఎంపిటిసి సభ్యులు ఆంజయ్యగౌడ్, నాయకులు జనార్ధన్ తదిరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేతను సన్మానించిన గుల్టపు మచ్చేందర్

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ పట్టణానికి చెందిన బిఆర్ఎస్‌నేత మోహిద్ ఖాన్‌ను శుక్రవారం గుట్టపు మచ్చేందర్ ఫౌండేషన్ చైర్మన్ గుట్టపు మచ్చేందర్ మర్యాద పూర్వకంగా కలుసుకుని శాలువాతో సత్కరించారు. మచ్చేందర్ వెంట మాజీ ప్రజాప్రతినిధులు, ఫౌండేషన్ బాధ్యులు, నాయకులు నాగశెట్టి, పండరి యాదవ్, లక్ష్మిబాయి రవీందర్ నాయక్, ప్రభాకర్, సత్యపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, పండరి, శంకర్‌గౌడ్, పండరి, శ్రీనివాస్, హర్షవర్ధన్‌రెడ్డి, తుకారంలు ఉన్నారు.

# రైతుల సంక్షేమానికి అంకితభావంతో పని చేస్తుంది

## మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు : ఎల్లయ్య

**చిన్నకోడూరు, ఆగస్టు 23,ప్రభాతవార్త :**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని మండల కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షులు మేకల ఎల్లయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ రైతు డిక్లరేషన్‌లో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే సిఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ. 2లక్షల రుణ మాఫీ చేసి తీరారని తెలిపారు. కొన్ని సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణామాఫీ కాలేదని వారికి సైతం ప్రభుత్వం రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. అర్హులై ఉండి రుణామాఫీ కానీ రైతులు మండల వ్యవసాయ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలే తప్ప బిఆర్ఎస్ నాయకుల మాయ మాటలు నమ్మి ఆందోళనలు చేయొద్దన్నారు. రైతులకు ఎలాంటి సమస్య ఉన్న నియోజకవర్గ పార్టీ ఇంచార్జి హరికృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందన్నారు. సమావేశంలో బిసిసెల్ మండల అధ్యక్షులు బంక చిరంజీవి యాదవ్, సీనియర్ నాయకులు మేకల పోచమల్లు, అజ్జు యాదవ్, పల్లె రాజు,కూస శ్రీనివాస్, జడల శ్రీశైలం, నల్వాల పోచయ్య, కోనేటి కర్ణాకర్, కోడూరు పోచయ్య, ఎర్ర రాములు తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీల సంక్షేమానికి బిఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందని బిఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు వజీర్, మొహిజ్‌లు అన్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన కొంత మంది కౌన్సిలర్లు బిఆర్ఎస్ పార్టీ మైనార్టీలకు ఏమి చేయలేదని అర్థం పర్థం లేకుండా వ్యాఖ్యాలు చేస్తున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 10 యేండ్ల పాటు డిప్యూటీ సిఎంతో పాటు హోంశాఖ పదవిని మైనార్టీలకు అప్పగించిందని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో మైనార్టీలకు కనీస చోట కూడా కల్పించలేదన్నారు. గత ప్రభుత్వం షాదిముబారక్, రంజాన్ తోఫా వంటి పథకాలను మైనార్టీలకు అందించిందన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు స్వంత డబ్బులతో మూడు ఎకరాల స్థలాన్ని ముస్లింల ఖబర్‌స్తాన్ కోసం కొనుగోలు చేసి ఇచ్చారని గుర్తు చేశారు. సిద్దిపేటలో హజ్ హౌజ్ నిర్మించారని తెలిపారు. మైనార్టీ గురుకుల పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులు నేటికి రావడం లేదన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ముస్లింలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హరీష్‌రావును విమర్శించే నైతిక హక్కు లేదన్నారు. సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

# సిఆర్ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

## -14 మందికి 4లక్షల 25వేల 5వందలు



సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

**జహీరాబాద్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన 14 మంది లబ్దిదారులకు మెరుగైన వైద్య చికిత్సలు అందుకునేందుకు ఎమ్మెలల్యే కొనింటి మాణిక్‌రావు శుక్రవారం సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు. సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్దిదారులు ఎమ్మెల్యే మాణిక్‌రావు, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు తట్టు నారాయణలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మచెందర్, తాజా మాజీ సర్పంచ్‌లు విజయ్, అబ్రహం, మల్చెల్మ పార్టీ అధ్యక్షులు ఆనందం, బుర్దిపాడ్ పార్టీ అధ్యక్షులు పెంటారెడ్డి, సత్వార్ గ్రామ అధ్యక్షులు సయీద్, మాజీ ఎంపిటిసి సభ్యులు బస్వరాజ్, నాయకులు మాణిక్‌రెడ్డి, శ్రీనివాస్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# సేఫ్టీ మోకుల వాడకంపై అవగాహన కలిగి ఉండాలి

**హుస్నాబాద్, ఆగస్టు23,ప్రభాతవార్త** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గౌడన్నలకు అందిస్తున్న సేఫ్టీ మోకుల వాడకంపై ప్రతీ ఒక్క కార్మికుడు అవగాహన కలిగి ఉండాలని ఎక్సైజ్ సిఐ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రోజున మండలంలోని పందిల్ల,మహ్మదాపూర్,మడద, తోటపల్లి,హుస్నాబాద్‌టౌన్, పోతారం గ్రామాల నుండి గీత కార్మికులకు సేఫ్టీ వాడకంపై శిక్షకులు రాజా,కరీంనగర్ గౌడ సంఘం అధ్యక్షులు ఆశీష్‌గౌడ్,వెంకటేష్‌గౌడ్,నియోజకవర్గ గౌడ సంఘం చైర్మెన్ మార్క అనిల్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రవాణా,బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు గౌడ సంఘం ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు సూచించారు. ఈ సందర్భంగా మోకులు వాడే విధానం గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ రూప,సిబ్బందితో పాటు బిసి సంక్షేమ అధికారి మహేష్,గౌరవ అధ్యక్షులు పర్శరాములు,ప్రధాన కార్యదర్శి పచ్చిమట్ల శ్రీకాంత్,బొంగోని శ్రీనివాస్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

**కంగ్టి, ఆగస్టు 23 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలో జాతీయ అంతరిక్ష దినోత్సవం కార్యక్రమాన్ని శుక్రవారం పాఠశాలల్లో విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక లిటిల్ స్టార్ పాఠశాల ఆవరణలో 400 మంది విద్యార్థులతో అంతరిక్షం ఆకారంలో ప్రదర్శన చేపట్టి అందర్నీ ఆకట్టుకున్నారు. చంద్రయన్-3 చంద్రునిపై విజయవం తంగా దక్షిణ ధృవం వైపు ల్యాండింగ్ జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, నరేష్‌రావు సుధీర్‌కుమార్, అనిల్, లక్ష్మన్, ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఓపెన్ పది, ఇంటర్ ప్రవేశాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం

**నిజాంపేట (ఖేడ్), ఆగస్టు 23 ప్రభాతవార్త:** నిజాంపేట జడ్పీహెచ్ఎస్ స్కూల్ స్టడి సెంటన్ నందు ఓపేన్ స్కూల్ స్టడీ సెంటర్ నందు విద్యార్థిని విద్యార్థు లు చదువుకునేందుకు పది, ఇంటర్‌లో చదుకునేందుకు వచ్చే నెల 10వ తేది వరకు దరఖాస్తులు చేసుకోవాలని కో ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ శ్రీదేవి సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. . మిగతా వివరాలకై సెల్‌నెం. 9391644170కు సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రాంప్రసాద్, ప్రవీణ్‌కుమార్, హరి, ఎస్టీయు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రాథోడ్, విజయ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, సురేఖ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ కళాశాలలో నేషనల్ స్పేస్ దినోత్సవం

**నాగల్‌గిద్ద, ఆగస్టు 23, ప్రభాతవార్త:** మండల పరిధిలోని మోర్గి గ్రామంలోని మోడల్ కళాశాలలో శుక్రవారం స్పేస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నమూనా చిత్ర పటాలను తయారు చేశారు. కళాశాల విద్యార్థులు పోస్టర్ ప్రజంటేషన్‌తో పాటు చంద్రాయన్ త్రీ మోడల్ నమూనాలను తయారు చేసి ప్రదర్శించారు. విద్యార్థులకు చంద్రాయన్ త్రి ప్రయోగ విధానంపై వీడియోను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలుషిత నీటి నివారణకు వాల్వులకు రింగుల బిగింపు

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 23, ప్రభాతవార్త:** నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డులలో పైపులైన్ వాల్వులకు మరమ్మత్తులు లేక లీకేజి ఏర్పడి కలుషిత నీరు సరఫరా అవుతుండటంతో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచనల మేరకు వాల్వులకు రింగులు బిగించినట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌లు తెలిపారు. వాల్వులకు మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్‌ల సమక్షంలో రింగులు బిగింపచేయించారు. ఇక నుంచి లీకేజిలు లేకుండా నీరు సరఫరా అవుతుందన్నారు.

**-సంపు వద్ద విద్యుత్ మరమ్మత్తులు...**

మున్సిపాలిటీ పరిధిలోని నీటి సంపు వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయించారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు పలు సంవత్సరాలుగా మరమ్మత్తులు లేకపోవడంతో బోరు మోటార్లు తరుచూ కాలిపోతుండటంతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలకు మరమ్మత్తులు చేయాలని సూచించడంతో విద్యుత్ అధికారులు స్పందించి శుక్రవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ శెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్‌ల నేతృత్వంలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మత్తులు చేయించారు.

# గంజాయి సేవించిన ఇద్దరు యువకులపై కేసు నమోదు



యువకులకు నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ చేస్తున్న పోలీసులు

**ములుగు, ఆగస్టు 23 (ప్రభాతవార్త):**

గంజాయి సేవించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసిన సంఘటన ములుగు మండలకేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి, ములుగు ఎస్ఐ విజయ్‌కుమార్‌లు తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండలకేంద్రంలోని ప్రభుత్వాసుపత్రి సమీపంలో ఉన్న ఫౌల్ట్రీఫాం వద్ద ములుగుకు చెందిన గంగబోయిన స్వామి(23), యు.సురేష్(22)లు ఇద్దరు వ్యక్తులు బహిరంగంగా మద్యం సేవిస్తున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో ములుగు పోలీసు సిబ్బందితో కలిసి దాడిచేసి తనిఖీలు నిర్వహించగా అక్కడ ఎలాంటి మద్యం లభించలేదని తెలిపారు. దీంతో అనుమానం వచ్చి నార్కోటిక్ డ్రగ్స్ టెస్టింగ్ మిషన్‌తో ఇరువురిని టెస్ట్ చేయగా వారు గంజాయి తీసుకున్నట్లు రిపోర్టు రావడంతో వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నట్లు తెలిపారు.

**మత్తుకు అలవాటుపడి జీవితాలు నాశనం చేసుకోవద్దు : సిఐ**

బంగారు భవిష్యత్తు గల యువత మత్తుకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని గజ్వేల్ రూరల్ సిఐ మహేందర్‌రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత మంది యువకులు చెడు మార్గాల వైపు ఆకర్షితులవుతున్నారని, గంజాయి ఇతర మత్తు పదార్థాలు సేవించే వారు వారి మానసిక స్థితిని కోల్పోయి నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. మాదకద్రవ్యాల విషయంలో ఎంత పెద్దవారు ఉన్నా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. మాదక ద్రవ్యాలకు యువతను దూరంగా ఉంచాలని, డ్రగ్స్ రహిత తెలంగాణ సమాజం కోసం అందరూ కృషి చేయాలని సూచించారు.

# విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి: నారాయణరెడ్డి

**హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు24, ప్రభాతవార్త** విద్యార్థులు శ్రద్దతో విద్యను అభ్యసించి శాస్త్రవేత్తలుగా ఎదిగి దేశానికి సేవలు అందించాలని ప్రిన్సిపాల్ కాయిత నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం రోజున జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో అంతరిక్ష కార్యక్రమాలకు సంబందించిన నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు భారత అంతరిక్ష రంగంలో సాధించిన విజయాలకు సంబందించిన చంద్రమాన్1,2,3, మంగళయాన్, గగన్‌యాన్, ఆదిత్య ఎల్1తో పాటు వివిధ రాకెట్‌లు, శాటిలైట్ నమూనాలను ప్రదర్శించి వాటి గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించి ,విద్యార్థులకు అంతరిక్షంలో ఉండే నమూనాల గురించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి :ఎస్ఐ

**హుస్నాబాద్(అక్కన్నపేట), ఆగస్టు24, ప్రభాతవార్త** విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అక్కన్నపేట ఎస్ఐ విజయ్‌భాస్కర్ అన్నారు. శుక్రవారం అక్కన్నపేట మండలంలోని గోవర్ధనగిరి గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, మహిళలకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, సామాజిక మాధ్యమాలు వాటి ప్రభావం, సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్, మహిళా రక్షణ, సెల్ఫ్ డిఫెన్స్, విద్యార్థి చట్టాలు, గుడ్ టచ్, బ్యాడ్‌టచ్, గంజాయి, సీసీ కెమోరాల వినియోగం, ఈవిటీజింగ్, నూతన చట్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి యువత మత్తుకు అలవాటు పడి వారి జీవితాలు పాడు చేసుకుంటున్నారన్నారు. మారకద్రవ్యాలకు, సామాజిక మాధ్యమాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నాలన్నారు. సమాజంలో జరుగుతున్న కొన్ని ఆవాం చనీయ సంఘటనలు వివరిస్తూ వారికి విధించే శిక్షలు తెలియజేశారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే వారికి స్పందించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమురయ్యతో పాటు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పసుపుతో అమ్మవారి అద్భుత చిత్రం

**గజ్వేల్, ఆగస్టు 23 (ప్రభాతవార్త):** శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా లక్ష్మీదేవి అమ్మవారి చిత్రాన్ని గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు పసుపు ఉపయోగించి అద్భుతంగా చిత్రించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ అమ్మవారికి పసుపు అంటే చాలా ఇష్టమని, అందుకే పసుపును ఉపయోగించి అమ్మవారి చిత్రాన్ని చిత్రించినట్లు తెలిపారు.